నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ సోమవారం 26-10-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి:33 సంచిక:74 పేజీలు:6 వెల: రూ.1/-

బియ్యం అక్రమాలపై సీఐడీ దాడులు.. 16 మంది మిల్లర్ల అరెస్ట్

హైదరాబాద్, అక్టోబర్ 25: తెలంగాణలో ప్రభుత్వ ధాన్యం, బియ్యం నిల్వలకు సంబంధించి అక్రమాలకు పాల్పడిన రైస్ మిల్లర్లపై సీఐడీ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వానికి చెందాల్సిన ధాన్యాన్ని పక్కదారి పట్టించి, బియ్యం సరఫరాలో అక్రమాలకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేశారు.

నిజామాబాద్, నల్గొండ, కరీంనగర్, రంగారెడ్డి, హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లోని మిల్లర్ల వ్యవహారాలపై దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. ఈ క్రమంలో పలువురు రైస్ మిల్లర్లను అదుపులోకి తీసుకోగా, మొత్తం 16 మందిని అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వానికి అప్పగించాల్సిన వేల టన్నుల ధాన్యాన్ని పక్కదారి పట్టించడంతో పాటు, లబ్ధిదారులకు సరఫరా చేయాల్సిన సన్న బియ్యం స్థానంలో దొడ్డు బియ్యం అందించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కరీంనగర్, ములుగు, మెదక్ జిల్లాల్లోని మిల్లర్లపైనా సీఐడీ కేసులు నమోదు చేసినట్లు సమాచారం.రైస్ మిల్లర్ల అక్రమాలపై పౌరసరఫరాల శాఖ అధికారులు విచారణ జరిపి సంబంధిత వివరాలను సీఐడీకి అందించినట్లు తెలుస్తోంది. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వ ధాన్యం నిల్వలు, మిల్లింగ్ వివరాలు, బియ్యం సరఫరా రికార్డులను అధికారులు పరిశీలిస్తున్నారు.

గంటకు 5 కి.మీ వేగంతో.. బంగాళాఖాతంలో వాయుగుండం..

అమరావతి, అక్టోబర్ 25:అమరావతి, అక్టోబర్ 25: ఆగ్నేయ, తూర్పు, మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం గంటకు 5 కి.మీ వేగంతో కదులుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎమ్ఏ) తెలిపింది. ప్రస్తుతానికి ఇది విశాఖకు 870 కి.మీ., కాకినాడకు 960 కి.మీ. దూరంలో కేంద్రీకృతమైందని వివరించింది. ఇవాళ తీవ్ర వాయుగుండంగా, రేపు తుఫానుగా బలపడే అవకాశముందని హెచ్చరించింది. ఈ వాయుగుండం ఈ నెల 27న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుఫానుగా బలపడుతుందని, 28న అతి తీవ్ర తుఫానుగా మారుతుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేసింది.

ఈనెల 28.. మధ్యాహ్నం నాటికి ఈ వాయుగుండం బాపట్ల- విశాఖ మధ్య తీరం దాటే అవకాశముందని ఏపీఎస్‌డీఎమ్ఏ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది తీరం దాటే సమయంలో గంటకు 115-125 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకూ మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని కోరారు. బీచ్‌లలో ఎగసిపడే అలలు వద్ద సెల్ఫీలు దిగే ప్రయత్నం చేయరాదని చెప్పారు.


సుద్దాల ఫౌండేషన్ ఆహ్వానం
15th ANNIVERSARY
సుద్దాల జానకమ్మ హనుమంతు
జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం - 2026
జాతీయ సాహితీ పురస్కార స్వీకర్త
శ్రీమతి స్వాతి శ్రీపాద
కవయిత్రి, కథా రచయిత్రి, అనువాదరత్న
డా॥ సుద్దాల అశోక్‌తేజ
వ్యవస్థాపక అధ్యక్షులు, సుద్దాల ఫౌండేషన్
వేదిక: రవీంద్రభారతి ప్రధాన మందిరం, హైదరాబాద్
సమయం: 26-10-2026 సోమవారం సా॥ 6:00 గం॥కు
సుద్దాల జానకమ్మ హనుమంతు
జాతీయ పురస్కార గ్రహీతలు
2010 ప్రముఖ సినీదర్శక నిర్మాత శ్రీ బి. నర్సింగరావు
2011 'ప్రజాయుద్ధనౌక' శ్రీ గద్దర్
2012 ఛత్తీస్‌గఢ్ పాండ్వా గాయని 'పద్మభూషణ్' డా॥ తీజన్‌బాయి
2013 కెన్యాదేశ రచయిత ప్రొ॥ ఎన్‌గూగి వాథియాంగో
2014 కవయిత్రి కుమారి సిరిసిల్ల రాజేశ్వరి
2015 ప్రజాకవి శ్రీ గూడ అంజయ్య
2016 ప్రజాకవి శ్రీ వంగపండు ప్రసాదరావు
2017 ప్రజాకవి శ్రీ గోరటి వెంకన్న
2018 ప్రజాకవి శ్రీ జయరాజ్
2019 పీపుల్ స్టార్ శ్రీ ఆర్.నారాయణమూర్తి
2022 'లోకకవి' డా॥ అందెశ్రీ
2023 అరుణోదయ విమలక్క
2024 అరుణోదయ నాగన్న
2025 శ్రీమతి ఓల్గా ప్రఖ్యాత రచయిత్రి
మధుప్రియ ప్రముఖ జానపద, సినీ గాయని
లాలీ నిధి ప్రముఖ నర్తకీమణి
సుద్దాల జానకమ్మ హనుమంతు
జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం - 2026
ముఖ్య అతిథులు
పూజ్యశ్రీ కె.వి. రమణ ఐ.ఎ.ఎస్(రి) పూర్వ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు
గౌ॥ శ్రీ అద్దంకి దయాకర్ శాసన మండలి సభ్యులు, ప్రభుత్వ విప్
గౌ॥ శ్రీ వెలుదండ నిత్యానందరావు ఉపాధ్యక్షులు, తెలుగు విశ్వవిద్యాలయం
ఆత్మీయ అతిథి శ్రీమతి నెల్లుట్ల రమాదేవి, ప్రముఖ సాహితీవేత్త
సభాధ్యక్షులు శ్రీ సుద్దాల సుధాకర్ తేజ పూర్వ రాష్ట్రప్రభుత్వ సలహాదారు, వాస్తు సైంటిస్ట్
కీలకోపన్యాసం శ్రీ తాటి రమేష్, విజ్ఞానదర్శిని వ్యవస్థాపక అధ్యక్షులు
ప్రత్యేక సన్మానం శ్రీ గుర్రం రాజశేఖర్ రెడ్డి, అడ్వకేట్
శ్రీ గూడ అయిలయ్య, ప్రజానాయకులు
స్మారక గీతం శ్రీమతి రచ్చ భారతి
స్వాగతం సిహెచ్. స్వప్న
వందన సమర్పణ స్వేచ్ఛ మార్గం
సభాకార్యక్రమానికి ముందుగా తెలంగాణ సాంస్కృతిక వారధి కళాకారులచే కుటుంబ జీవన విధ్వంసం నాటిక ప్రదర్శన
డా॥ సుద్దాల అశోక్‌తేజ వ్యవస్థాపక అధ్యక్షులు, సుద్దాల ఫౌండేషన్

గంగానదిపై గగన విన్యాసాలు.. 'వింగ్స్ ఓవర్ గంగా' ప్రదర్శనను తిలకించిన ప్రధాని మోదీ



వారణాసి, అక్టోబర్ 25: భారత వైమానిక దళం 94వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తర్ ప్రదేశ్ లోని వారణాసిలో ఉన్న పవిత్ర నమో ఘాట్ వద్ద ఆదివారం 'వింగ్స్ ఓవర్ గంగా' పేరుతో నిర్వహించిన వైమానిక ప్రదర్శనను ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరై తిలకించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఉత్తర్ ప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైమానిక దళానికి చెందిన సుప్రసిద్ధ 'సూర్య కిరణ్ ఏరోబాటిక్ టీమ్' , 'సారంగ్ హెలికాప్టర్ డిస్‌ప్లే టీమ్' తమ అద్భుతమైన గగనతల విన్యాసాలతో అలరించాయి. స్వదేశీ ఫైటర్ జెట్ తేజస్ , లైట్ కంబాట్ హెలికాప్టర్ ప్రచండ్ ఫ్రంట్‌లైన్ ఫైటర్ జెట్లు సుఖోయ్, రఫేల్, రవాణా విమానాలు ఐఎల్-76, ఐఎల్-78, సి-295, ఏఎన్-32లు ఈ విన్యాసాలలో పాల్గొన్నాయి.

ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌తో పాటు భారత నావికాదళం (ఎనిటతిజీని ఔజీలఎ), భారత ఆర్మీకి చెందిన విమానాలు, హెలికాప్టర్లు కూడా పాల్గొని సాయుధ దళాల సంయుక్త సామర్థ్యాన్ని చాటిచెప్పాయి.

వారణాసిలో దుస్తుల తయారీ యూనిట్ ప్రారంభోత్సవం, మహిళా సమ్మేళనం

ఏరియల్ డిస్‌ప్లే కార్యక్రమానికి హాజరుకావడానికి ముందు ప్రధాని మోదీ వారణాసిలో 'అరవింద్ లిమిటెడ్' నూతన దుస్తుల తయారీ కేంద్రాన్ని ప్రధాని ప్రారంభించారు. ఇది పూర్తిగా మహిళల నేతృత్వంలో సాగే పారిశ్రామిక ప్రాజెక్ట్ కావడంతో ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి, మహిళా సాధికారతకు ఎంతో దోహదపడుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

ఇవాళ వారణాసి పర్యటనకు విచ్చేసిన ప్రధానికి స్థానిక మహిళలు జాతీయ జెండాలు, బీజేపీ జెండాలు చేతబూని, సాంప్రదాయ దప్పులు వాయిస్తూ రోడ్డు పొడవునా ఘన స్వాగతం పలికారు. ప్రధాని మోదీ మహిళా సాధికారతకు చేస్తున్న కృషికి గాను వారంతా కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ విధానాలపై ప్రజాగ్రహం.. యూరప్ దేశాల్లో ఆందోళనల సెగ..



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 25: ఐరోపాలోని పలు దేశాల్లో ఆందోళనలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. పెరుగుతున్న జీవన వ్యయం, అందుబాటులో లేని ఇళ్లు, విద్యా రంగంలోని సమస్యలు, ప్రభుత్వ విధానాలపై అసంతృప్తి ప్రజలను రోడ్లపైకి తీసుకొసు న్నాయి. ఫ్రాన్స్, అల్బేనియా, ఇటలీ, స్పెయిన్, పోర్చుగల్ సహా పలు దేశాల్లో నిరసనలు కొనసాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఆందోళనలు ప్రశాంతంగా సాగగా, మరి కొన్ని చోట్ల నిరసనకారులు, పోలీసుల మధ్య ఘర్షణలు చోటుచేసు కున్నాయి. పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగి ంచడంతోపాటు పలువురిని అదుపులోకి తీసుకున్నారు ఫ్రాన్స్‌లో జీవన వ్యయం, ప్రభుత్వ విధానాలు, విద్యా రంగ సమస్యలపై ప్రజలు పెద్ద ఎత్తున నిరసనలకు దిగారు. అక్టోబర్ 24న దేశవ్యాప్తంగా జరిగిన ప్రదర్శనల్లో సుమారు 4.10 లక్షల మంది పాల్గొన్నట్లు ఫ్రాన్స్ అంతర్గత వ్యవహారాల శాఖ అంచనా వేసింది. అయితే, కార్మిక సంఘాలు మాత్రం నిరసనకారుల సంఖ్య సుమారు 8 లక్షలుగా పేర్కొన్నాయి. పారిస్‌తోపాటు లియోన్, లిల్లే, మార్సెయి, మాంట్‌పెల్లియర్, నాంటెస్, టులూజ్ నగరాల్లో ఘర్షణలు నమో దయ్యాయి. నిరసనల్లో ఎక్కువ భాగం ప్రశాంతంగా సాగినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో నల్ల దుస్తులు ధరించిన వ్యక్తులు పోలీసులపై వస్తువులు విసిరారు. దేశవ్యాప్తంగా దాదాపు వెయ్యి మందిని పోలీసులు అరెస్టు చేశారు

అల్బేనియా రాజధాని టిరానాలో విద్యార్థులు, కళాకారులు, ప్రతిపక్ష పార్టీల మద్దతుదారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. అవినీతి ఆరోపణలు, జీవన వ్యయం, విద్యా రంగ సమస్యలు ఈ ఆందోళనలకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. కొన్ని చోట్ల నిరసనకారులు ప్రభుత్వ భవనాలపై దాడులకు దిగడంతో పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించి జనాన్ని చెదరగొట్టారు. పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఇటలీలోని మిలాన్, రోమ్, టురిన్, నేపుల్స్, బొలోన్యా, ఫ్లోరెన్స్ నగరాల్లో వేలాది మంది నిరసనల్లో పాల్గొన్నారు. జీవన వ్యయం, ప్రభుత్వ ప్రజా సేవలు, విద్య, యుద్ధాలకు సంబంధించిన విధానాలు వంటి అంశాలపై ప్రజలు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో నిరసనకారులు సీసాలు, రాళ్లు, బాణసంచా విసిరారు. ఇటలీ పోలీసులు ఎనిమిది నగరాల్లో జరిగిన నిరసనల సందర్భంగా 371 మందిని తాత్కాలికంగా అదుపులోకి తీసుకున్నారు.

వసుధైక కుటుంబం మాటల్లో కాదు.. చేతల్లో చూపిస్తున్నాం: జైశంకర్

ఢిల్లీ, అక్టోబర్ 25: ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని భారత్ మంటపంలో నిర్వహించిన చిన్మయ అమృత్ మహోత్సవ్ గ్లోబల్ సమ్మేళనంలో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ప్రసంగించారు. ప్రపంచ దేశాలకు టీకాల పంపిణీ, అభివృద్ధి భాగస్వామ్యాలు, మానవతా సాయం ద్వారా భారత్ తన 'వసుధైక కుటుంబం' (ప్రపంచమంతా ఒకే కుటుంబం) సిద్ధాంతాన్ని కేవలం ప్రచారం చేయడమే కాకుండా ఆచరణలో చూపిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

కోవిడ్ సమయంలో సాయం: దేశంలో వ్యాక్సినేషన్ ప్రక్రియ వేగంగా జరుగుతున్న సమయంలోనే, ఇతర వెనుకబడిన దేశాలకు కూడా టీకాలను అందించి భారత్ పెద్దమనసు చాటుకుందని గుర్తుచేశారు.

అభివృద్ధి భాగస్వామ్యం: భారత్ నేడు 78 దేశాలలో వందలాది అభివృద్ధి ప్రాజెక్టులను నిర్వహిస్తోందని, శిక్షణ, సామర్థ్య నిర్మాణ సంస్థలలో ప్రపంచానికి చోటు కల్పిస్తోందని తెలిపారు.తక్షణ స్పందన: నేపాల్, శ్రీలంక, వెనిజులా లేదా జమైకా వంటి దేశాల్లో విపత్తులు ఎదురైనప్పుడు భారత్ మొదటిగా స్పందించి ఆదుకుందని తెలిపారు.

రూ.2.57 కోట్ల అంచనా వ్యయంతో ఆధునిక సౌకర్యాల కల్పన

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో రూ.13 వేల కోట్ల మేర లబ్ధి

2027 గోదావరి పుష్కరాల అభివృద్ధికి రూ.226 కోట్లు



కరీంనగర్, అక్టోబర్ 25:ధర్మపురి బస్‌స్టేషన్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు రూ.2.57 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఆధునీకరణ పనులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్‌తో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. అంతకుముందు ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి మంత్రులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేందుకు బస్‌స్టేషన్ ఆధునీకరణ పనుల్లో భాగంగా రెండు ప్లాట్‌ఫారాల విస్తరణ, సీసీ పేవ్‌మెంట్, గ్రానైట్ ఫ్లోరింగ్, భవనానికి ఏసీపీ క్లాడింగ్, కొత్త మరుగుదొడ్ల నిర్మాణం, సెప్టిక్ ట్యాంక్ ఏర్పాటు, రూఫ్ స్లాబ్, సీలింగ్ మరమ్మతులు చేపట్టనున్నారు. వర్షపు నీటి పారుదల వ్యవస్థ అభివృద్ధి, పెయింటింగ్, పల్లపు ప్రాంతాల్లో కంకర వేయడం, ల్యాండ్‌స్కేపింగ్, విద్యుదీకరణ, పంప్‌సెట్‌తో కూడిన బోర్‌వెల్ ఏర్పాటు చేయనున్నారు.

మహిళలకు ఉచిత ప్రయాణం.. ఆర్టీసీ సేవల విస్తరణ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇప్పటివరకు సుమారు 360 కోట్ల ఉచిత ప్రయాణాల ద్వారా మహిళలకు దాదాపు రూ.13 వేల కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం చేకూరిందని పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు సేవలను విస్తరించడంతోపాటు బాసర, భద్రాచలం, ధర్మపురి, గూడెం, కాళేశ్వరం తదితర పుణ్యక్షేత్రాలకు వచ్చే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ధర్మపురి నుంచి ముంబైకి ఏసీ బస్సు నడిపే ప్రతిపాదనను పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.

ధర్మపురిలో బస్ డిపో ఏర్పాటుకు చర్యలు

1993లో ప్రారంభమైన ధర్మపురి బస్‌స్టేషన్‌ను ఆధునిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ధర్మపురిలో బస్ డిపో ఏర్పాటు చేయాలన్న స్థానిక ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికలకు ముందే డిపో నిర్మాణానికి శంకుస్థాపన జరిగేలా సంబంధిత అధికారులు కృషి చేయాలని కోరినట్లు వెల్లడించారు.

పుష్కరాల అభివృద్ధికి రూ.226 కోట్లు

2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలోని పుణ్యక్షేత్రాలు, ఘాట్లు, రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ధర్మపురి ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.10 కోట్లు, పుష్కర ఘాట్లు, బైపాస్ రహదారులు తదితర అభివృద్ధి పనులకు సుమారు రూ.226 కోట్ల నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారని, బస్‌స్టేషన్ ఆధునీకరణతో వారికి మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఆలయాలు, ఘాట్లు, రహదారుల అభివృద్ధితో పుష్కరాల సమయంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్.దినేష్, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై విదేశాల్లోనూ ఆదరణ పెరుగుతోంది: ఎంపీ రఘునందన్

సిద్దిపేట జిల్లా, అక్టోబరు 25 (భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై విదేశాల్లోనూ ఆదరణ పెరుగుతోందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు (ఃఏఖ ఓఖ ఖీజీణష్ట్రబీనిజీనిటజీని ఖీజీనీ) వ్యాఖ్యానించారు. అమెరికాలోనూ అయ్యప్ప భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని పత్రికల్లో కథనాలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈరోజు (ఆదివారం) సిద్దిపేటలో ఘనంగా అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించారు. కొండ మల్లయ్య గార్డెన్‌లో బీజేపీ సీనియర్ నేత దూది శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎంపీ రఘునందన్ రావు పాల్గొని, మాట్లాడారు.

భారతదేశం అంటేనే గొప్ప సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమని ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా అందరూ ఒక్కచోట చేరడం సంతోషకరమని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌కే పరిమితం కాకుండా టైర్-2 నగరాల్లోనూ అలయ్ బలయ్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా కలిసి మెలిసి ఉండటమే అలయ్ బలయ్ స్ఫూర్తి అని చెప్పారు. ఇస్లామిక్ దేశాలైన గల్ఫ్ దేశాల్లోనూ బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నారని వెల్లడించారు.

దేశాలు మారినా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అభిమానం తగ్గడం లేదని ఎంపీ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయ సంస్కృతి విస్తరిస్తుండటం మనకు గర్వకారణమని అన్నారు.

సత్యనిష్ఠ ద్వారా సమృద్ధి సుసాధ్యం !

(అక్టోబర్ 26 - నవంబర్ 01, 2026 : "విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు" సందర్భంగా

ఎక్కడ, ఎప్పుడూ చూసినా అవినీతి దుర్వాసనలు గుప్పుమంటున్నాయి. అనాదిగా స్థానిక సంస్థల నుంచి కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖల వరకు అన్ని విభాగాల్లో/స్థాయిల్లో అవినీతి భూతం రెచ్చిపోతున్నది. వార్డు మెంబర్ నుంచి కేంద్ర మంత్రుల వరకు అన్ని విభాగాల్లో ఆయా స్థాయిలో అవినీతి చెదలు దేశ శ్రేయస్సును భోంచేస్తున్నారు. ప్రభుత్వ శాఖల్లో పని కావాలంటే అమ్యామ్యాలు ముట్టచెప్పాల్సిన అనివార్య అగత్యం ఏర్పడింది. అక్రమార్జనలకు అంతు లేకుండా పోతున్నది. అవినీతి నిరోధక శాఖలు ప్రతి రోజు ఏదో ఒక అవినీతి చేపను వలపన్ని పట్టుకుంటున్నది, తర్వాత అవినీతికి తలవంచి వదిలేస్తున్నది. స్కామ్‌లు, లంచాలు నిత్యకృత్యం అయ్యాయి. ప్రభుత్వ శాఖలో పని జరగాలంటే ముట్టచెప్పాల్సిందే అని ప్రజలు దృఢ అభిప్రాయానికి వస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని పెంచి పోషిస్తున్న యంత్రాంగాలు, ఆహార సరుకుల కల్తీల లీలలు, నాణ్యతకు తిలోదకాలిస్తూ ప్రాజెక్టుల నిర్మాణాలు, పట్టపగలే లంచాలు తీసుకుంటున్న ప్రబుద్ధులు మన ముందు కాలరెగిరేస్తూ కార్లల్లో షికార్లు కొడుతున్నారు. మనిషిలో నైతికతకు గండి పడితే అవినీతి వరదలు ప్రవహిస్తాయని తెలుసుకోవాలి. అవినీతి చెదలుకు అడ్డుకట్ట వేయడానికి కేంద్ర ప్రభుత్వం విజిలెన్స్ లేదా అప్రమత్తత విభాగాలను ఎన్ని ఏర్పాటు చేసినా ఆయా శాఖల స్వయం ప్రతిత్తికి భంగం కలిగించే విధంగా ప్రభుత్వ ప్రబుద్ధుల్లో చిత్తశుద్ధి లోపించి అనవసర స్వార్థ పూరిత జోక్యంతో మూడు పువ్వులు ఆరుకాయలుగా అక్రమార్కులు విర్రిల్లడం విచారకరం.

అవినీతి రహిత నవ భారత నిర్మాణానికి?:

భారత కేంద్ర ప్రభుత్వ వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థల్లో పని తీరును మెరుగు పరచడం, పారదర్శకత పెంచడం, కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాలు నిర్వహించడం, పిర్యాదుల విభాగాలను బలోపేతం చేయడం, ఆరోపణలు గుప్పుమన్నపుడు వెంటనే నిష్పాక్షిక విచారణ జరపడం, విజిలెన్స్ విషయంలో అత్యాధునిక డిజిటల్ సదుపాయాలను వినియోగించుకోవడం లాంటి లక్ష్యాలతో 2026, 26 అక్టోబర్ నుండి 01 నవంబర్ వరకు "విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు లేదా విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్"ను ఘనంగా నిర్వహించడానికి ప్రభుత్వం పూర్తి ఏర్పాట్లు చేసింది. ఈ వారోత్సవాల్లో భాగంగా దేశ సమగ్రతను కాపాడడం, అవినీతి నిర్మూలన, బంధు ప్రీతి చూపడం, పక్షపాతాన్ని పెంచి పోషించడం, లంచం ఇవ్వడమా కాదు లంచాన్ని తీసుకోవడం కూడా నేరమని అవగాహన పర్చడం కొనసాగుతున్నది. నవ భారతదేశాన్ని నిర్మించడానికి మన జీవితాల్లో నైతిక విలువలను పెంపొందించడం, ప్రోత్సహించడం అత్యవసరమని అవగాహన కల్పించడం కొనసాగుతున్నది.

సత్యనిష్ఠ ద్వారా సమృద్ధి :

"సత్యనిష్ఠ ద్వారా సమృద్ధి (ప్రొబిటీ ఫర్ ప్రాస్పెరిటీ)" అనే థీమ్‌ను తీసుకొని ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నది. భారత రత్న సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ జన్మదినాన్ని (31 అక్టోబర్) పురస్కరించుకొని ప్రతి ఏట విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రతి 'భారతీయుడు' అప్రమత్తంగా ఉండాలని, ఎల్లవేళల నిజాయితీ/చిత్తశుద్ధి అత్యున్నత ప్రమాణాల్లో ఉండాలని, అవినీతి రహిత సమాజ స్థాపనకు ప్రతినబూనాలని ప్రజలను కోరుతున్నారు.

సెంట్రల్ విజిలెన్స్ కమిషన్(సివిసీ):

"సంతానం కమిటీ" సిఫార్సుల ఆధారంగా దేశ సమగ్రత కాపాడడం, పారదర్శకత పెంచడం, జవాబుదారీతనాన్ని అమలు చేయడం, అవినీతి నిర్మూలన లాంటి ధ్యేయాలతో 1964లో భారత ప్రభుత్వం 'సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ లేదా సివిసీ' అనబడే అత్యున్నత ప్రభుత్వ సంస్థను ఏర్పాటు చేసింది. విజిలెన్స్ కార్యకలాపాల్లో సున్నితమైన ప్రాంతాల్లో సిబ్బంది పర్యవేక్షణ, పిర్యాదుల విచారణ, దుష్ప్రవర్తనలకు ఆస్కారం లేకుండా విధుల నిర్వహణకు సలహాలు ఇవ్వడం, కాంట్రాక్టుల పర్యవేక్షణ/ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం లాంటి ప్రధాన విధులతో సివిసీ, ఇతర విజిలెన్స్ శాఖలు పని చేస్తున్నాయి. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా విద్యాలయాల్లో నైతిక ప్రవర్తన ప్రాధాన్య అంశాలను తీసుకొని పలు పోటీలను నిర్వహించడం, విజిలెన్స్ విభాగాలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం, నైతిక ప్రవర్తన ప్రదర్శించిన సిబ్బందిని సన్మానించడం, విజిలెన్స్ అవగాహన ప్రతిజ్ఞను సామూహికంగా చేయించడం, దేశ శ్రేయస్సు కోరి నీతి నిజాయితీలను పెంచి పోషించడం లాంటి పలు కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా మారింది.

రాజకీయ నాయకుల్లో నైతిక ప్రవర్తన పెరిగితే ప్రభుత్వ శాఖల్లో కూడా అవినీతి తగ్గుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నేడు మెజారిటీ ఎంఎల్ఏ, ఎంపీలు అవినీతి ఆరోపణల అభియోగాలను ఎదుర్కొంటున్నారు. దీపావళి పర్వదిన వేళల్లో మన జీవితాల్లో వెలుగులు ప్రసరించడానికి నైతిక సమాజ స్థాపన జరగాలని, ప్రతి ఒక్కరు అసలుసిసలైన 'భారతీయుడు' కావాలని, అవినీతి రహిత భారత కలలను సాకారం చేయడానికి అందరం చేయి చేయి కలిపి అవినీతి అనకొండలను ఆమెడ దూరం తరిమేద్దాం, నీతి నిజాయితీ వర్ధిల్లే సమాజ స్థాపనకు కృషి చేద్దాం.



-మధుపాళీ
9949700037

వారణాసిలోని నమో ఘాట్ వద్ద వైమానిక దళ దినోత్సవ విన్యాసాలు-2026ను వీక్షించనున్న పీఎం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 25:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అక్టోబర్ 25, 2026న ఉత్తర ప్రదేశ్, ఒడిశాలో పర్యటించనున్నారు. ఉదయం సుమారు 11 గంటలకు వారణాసిలో నూతన వస్త్ర తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం సుమారు ఒంటి గంటకు వారణాసిలోని నమో ఘాట్ వద్ద జరిగే వైమానిక దళ దినోత్సవ విన్యాసాల ప్రదర్శన-2026కు ముఖ్య అతిథిగా హాజరై, ప్రదర్శనను వీక్షిస్తారు.

అనంతరం ప్రధానమంత్రి ఒడిశాకు వెళ్తారు. అక్కడ సాయంత్రం సుమారు 4:45 గంటలకు భువనేశ్వర్‌లో భారతీయ రిజర్వ్ బ్యాంక్ డేటా సెంటర్, సైబర్ భద్రత శిక్షణ సంస్థను ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా సభనుద్దేశించి ప్రసంగిస్తారు.

వారణాసిలో పీఎం పర్యటన

ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో అరవింద్ లిమిటెడ్ నూతన వస్త్ర తయారీ కేంద్రాన్ని ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఈ తయారీ కేంద్రం... భారత జౌళి, వస్త్ర తయారీ వ్యవస్థను బలోపేతం చేయటం, ఈ ప్రాంతంలో పారిశ్రామిక వృద్ధిని ప్రోత్సహించే దిశగా ముందడుగును సూచిస్తుంది.

ఆధునిక తయారీ పద్ధతులపై దృష్టి సారించే ఈ తయారీ కేంద్రం.. ముఖ్యంగా మహిళలకు మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించటంతో పాటు ఈ ప్రాంత ఆర్థిక పురోగతికి దోహదపడుతుంది. పారిశ్రామిక పెట్టుబడులకు, తయారీ ఆధారిత వృద్ధికి గమ్యస్థానంగా పెరుగుతున్న ఉత్తరప్రదేశ్ పాత్రను ఈ ప్రారంభోత్సవం చాటిచెబుతుంది. అంతర్జాతీయ స్థాయిలో వినియోగదారులు ఉన్నందున, వారణాసిలో తయారైన ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు విస్తరిస్తున్నాయి. ప్రధానంగా మహిళల భాగస్వామ్యంతో నడిచే ఈ కార్యక్రమం, మహిళా నేతృత్వంలోని అభివృద్ధికి శక్తిమంతమైన ప్రతీక.

వారణాసిలోని నమో ఘాట్ వద్ద జరిగే వైమానిక దళ విన్యాసాల ప్రదర్శన-2026ను ప్రధానమంత్రి వీక్షిస్తారు. భారత వైమానిక దళ 94వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ''వింగ్స్ ఓవర్ గంగాన్'' ఇతివృత్తంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఈ వైమానిక ప్రదర్శనలో రవాణా విమానాలతో పాటు తేజస్, తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ (ఎల్‌సీహెచ్) ప్రచండ్, ఎస్ యూ-30 ఎంకెఐ, రఫేల్ వంటి యుద్ధ విమానాలు కనువిందు చేస్తాయి. ఉమ్మడి కార్యాచరణను ప్రదర్శిస్తూ భారత నౌకాదళం, సైన్యానికి చెందిన విమానాలు కూడా ఇందులో పాల్గొంటాయి. సూర్యకిరణ్ ఏరోబాటిక్ టీమ్, సారంగ్ హెలికాప్టర్ డిస్‌ప్లే టీమ్‌తో సహా భారత వైమానిక దళానికి చెందిన ప్రతిష్ఠాత్మక ప్రదర్శన బృందాలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటాయి. అత్యంత కచ్చితత్వంతో కూడిన గగనతల విన్యాసాలు, నమన్వయం, కార్యాచరణ నైపుణ్యాన్ని ఈ ప్రదర్శన కళ్లకు కడుతుంది.

భువనేశ్వర్‌లో పీఎం పర్యటన

భారత ఆర్థిక వ్యవస్థ సాంకేతిక పునాదులను బలోపేతం చేయటంలో కీలక ఘట్టాన్ని నూచిన్తూ.. భువనేశ్వర్‌లో భారతీయ రిజర్వ్ బ్యాంక్ నూతనంగా ఏర్పాటు చేసిన డేటా సెంటర్, సైబర్ సెక్యూరిటీ శిక్షణ సంస్థను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. బ్యాంక్ కంప్యూటింగ్ అవసరాలను తీర్చేందుకు, ఆర్బీఐతో పాటు ఆర్థిక రంగానికి సురక్షితమైన, దృఢమైన, విస్తరించదగిన, భవిష్యత్ అవసరాలకు తగిన కంప్యూటింగ్ వ్యవస్థను అందించేలా వీటిని రూపొందించారు.

ఇతర ప్రధాన కార్యక్రమాలతో పాటు అత్యంత కీలకమైన చెల్లింపులు, సెటిల్‌మెంట్ వ్యవస్థలను నాలుగు అత్యాధునిక డేటా సెంటర్లు నిర్వహిస్తాయి. డేటా సెంటర్ మౌలిక సదుపాయాలకు ప్రపంచ ప్రమాణమైన అప్‌టైమ్ ఇనిస్టిట్యూట్ టైర్ ఎఐ సర్టిఫికేషన్‌ను ఈ కేంద్రం పొందింది. కార్యాచరణ స్థిరత్వంలో దీన్ని ఉన్నత శ్రేణిలో నిలుపుతుంది. ప్రపంచవ్యాప్తంగా బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్) రంగంలో టైర్ ఎఐ సర్టిఫికేషన్ పొందిన అతిపెద్ద కేంద్రాల్లో ఇదొకటి. డిజిటల్ ఆర్థిక సేవల విస్తృతిని, సామర్థ్యాన్ని, విశ్వసనీయతను పెంచటానికి ఇది దోహదపడుతుంది. సాంకేతికత ఆధారంగా వేగంగా వృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థకు సురక్షితమైన డిజిటల్ పునాదిగా ఇది నిలుస్తుంది. ప్రపంచ సెంట్రల్ బ్యాంకింగ్ సమాజంలో డిజిటల్ మౌలిక సదుపాయాల అగ్రగామిగా రిజర్వ్ బ్యాంక్‌కు ఉన్న ప్రత్యేక స్థానాన్ని మరింత బలోపేతం చేసేందుకు కూడా సహాయపడుతుంది.

సైబర్ భద్రత, ఎంట ర్‌ప్రైజ్-టెక్నాలజీ శిక్షణ, పరిశోధన, రంగాల వారీగా సామర్థ్యాల అభివృద్ధికి ప్రత్యేక సంస్థాగత వేదికను అందిస్తూ.. సైబర్ సెక్యూరిటీ శిక్షణా సంస్థ సామర్థ్య నిర్మాణాన్ని ప్రోత్సహిస్తుంది. క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ, ఇతర సరికొత్త సాంకేతిక తలతో నహా బీఎఫ్ఎస్ఐ రంగానికి సంబంధించిన అత్యాధు నిక సాంకేతికతలపై ఈ సంస్థ దృష్టి సారిస్తుంది.

శబరిమలకు మహా పాదయాత్ర



ఆదిలాబాద్, అక్టోబర్ 25:కేరళ రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమల అయ్యప్ప స్వామి దర్శనం కోసం గూడెంలోని అభినవ శబరిమల అయ్యప్ప దేవాలయం నుంచి స్వాములు ఆదివారం మహా పాదయాత్రగా బయలుదేరారు.

గురుస్వామి చక్రవర్తుల పురుషోత్తమాచార్యుల చేతుల మీదుగా మాలధారణ అనంతరం, గురుస్వామి గడప నాగరాజు ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభమైంది. అయ్యప్ప స్వామిపై అపారమైన భక్తి విశ్వాసాలతో ఇరుముడులు ధరించి స్వాములు కాలినడకన శబరిమలకు పయనమయ్యారు. అయ్యప్ప దీక్షలో భాగంగా నియమ నిష్ఠలను పాటిస్తూ, 'స్వామియే శరణం అయ్యప్ప' నామస్మరణతో యాత్రను కొనసాగించనున్నారు. ఈ పాదయాత్రలో పెద్దూరి భాస్కర్, మొరుపుటాల సంజీవ్, అలిశెట్టి అరుణ్‌కుమార్, బుద్దె వెంకటేష్ తదితర అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. స్వామివారి ఆశీస్సులతో పాదయాత్ర విజయవంతంగా పూర్తి, శబరిమలలో దర్శనం ప్రశాంతంగా జరగాలని భక్తులు ఆకాంక్షించారు.

తక్కువ నీటితో పండే పంటల సాగుకు ప్రాధాన్యం

-రైతులకు డీఏఓ వెంకటి సూచన



ఆదిలాబాద్, అక్టోబర్ 25: ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని డీఏఓ వెంకటి సూచించారు. శనివారం మండలంలోని కంచన్‌పల్లి, చోర్పల్లి, పీక్లా తండా గ్రామపంచాయతీల్లో నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో ఆయన రైతులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, భూసార పరీక్షల ఆధారంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. రసాయన ఎరువులను అవసరమైన మోతాదులోనే వినియోగిస్తూ, సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలన్నారు. పంట వ్యర్థాలను కాల్చకుండా భూమిలో కలియదున్ని సేంద్రియ పదార్థంగా మార్చుకోవాలని తెలిపారు.

నీటి వినియోగం అధికంగా ఉండే వరికి బదులు గా పెసర, మినుము, వేరుశనగ, నువ్వులు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా నీటిని ఆదా చేయడంతోపాటు పంట నష్టాలను తగ్గించు కోవచ్చని పేర్కొన్నారు.

వాతావ రణ మార్పులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొం దించుకుని, శాస్త్రీయ సాగు పద్ధతులను పాటించాలని రైతుల కు సూచించారు.

కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి సంజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వీరబాబు, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు), రైతులు పాల్గొన్నారు.

గులాబీ గూటికి భార్గవ్ దేశ్‌పాండే!

కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక..

ఆదిలాబాద్, అక్టోబర్ 25: కాంగ్రెస్ పార్టీలో రెండు దశాబ్దాలుగా క్రియాశీలకంగా పనిచేసిన భార్గవ్ దేశ్‌పాండే ఆ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు ఆయనకు స్వాగతం పలికి అభినందించారు.

కాంగ్రెస్‌లో కీలక బాధ్యతలు

ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన భార్గవ్ దేశ్‌పాండే పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘన కారణంగా మూడేళ్ల క్రితం సస్పెన్షన్‌కు గురయ్యారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. 2010 నుంచి 2012 వరకు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా, 2012 నుంచి 2014 వరకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2014 నుంచి నాలుగేళ్లపాటు ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. పదేళ్లపాటు ఏఐసీసీ సభ్యుడిగా కొనసాగారు.

కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి

బీఆర్ఎస్‌లో చేరిన అనంతరం భార్గవ్ దేశ్‌పాండే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు జోగు రామన్న, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, పార్టీ నాయకులు జాన్సన్ నాయక్, బాల్క సుమన్, జోగు మహేందర్, కేం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

నగరంలో 20 కి.మీ సైకిల్ ర్యాలీ



కరీంనగర్, అక్టోబర్ 25:: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఆదివారం కరీంనగర్ లో 20 కి.మీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి నగర పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం జెండా ఊపి ప్రారంభించారు.

కరీంనగర్ రన్నర్స్, సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు, డాక్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ మార్గం పరేడ్ గ్రౌండ్ నుండి బస్ స్టేషన్ ప్రతిమ మల్టీప్లెక్స్ గీతాభవన్ మంకమ్మతోట పొన్నం కాంప్లెక్స్ శివ థియేటర్ సర్కిల్ కెమిస్ట్రీ భవన్ ఎలక్ట్రిసిటీ ఆఫీస్ వద్ద యూ టర్న్ కోర్ట్ చౌరస్తా మంచిర్యాల చౌరస్తా గాంధీ చౌరస్తా నాఖా చౌరస్తా బోట్ చౌరస్తా కమాన్ చౌరస్తా తిరిగి బస్టాండ్ మీదుగా పరేడ్ గ్రౌండ్ లో ముగిసింది. అనంతరం సీపీ అమరవీరుల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. అక్టోబర్ 31 వరకు వారోత్సవాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రజలు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఏసీపీలు వెంకటస్వామి, విజయకుమార్, ఇన్స్ పెక్టర్లు, రన్నర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మహేష్ పాసుల, డాక్టర్ కిరణ్, అడ్వకేట్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



వేములవాడలో 80 అడుగుల రహదారి.. తుది దశకు పనులు!

నాణ్యతతో నిర్మాణాలు పూర్తి చేయాలి.. అధికారులకు విప్ ఆది శ్రీనివాస్ ఆదేశం



కరీంనగర్, అక్టోబర్ 25: దశాబ్దాల కలగా ఉన్న వేములవాడ పట్టణంలోని 80 అడుగుల రహదారి విస్తరణ పనులు తుది దశకు చేరుకున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.

రహదారి నిర్మాణ పనులను మున్సిపల్ పాలకవర్గం, సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, దీర్ఘకాలం మన్నికగా ఉండేలా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాజన్న ఆలయ అభివృద్ధి, వేములవాడ పట్టణ ప్రగతి ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో రాజన్న ఆలయ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

రూ.250 కోట్లకు పైగా నిధులు

రాజన్న ఆలయ అభివృద్ధికి ఇప్పటివరకు రూ.250 కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. ఆలయ అభివృద్ధి పనులు 55 శాతం, అన్నదాన సత్రం నిర్మాణం 50 శాతం వరకు పూర్తయ్యాయని తెలిపారు. అదనంగా రూ.99.40 కోట్ల నిధులు మంజూరైన నేపథ్యంలో మిగిలిన పనులను వేగవంతం చేస్తున్నట్లు వివరించారు. 80 అడుగుల రహదారి విస్తరణ కోసం సుమారు రూ.47 కోట్లతో ప్రభుత్వ ఉత్తర్వులు జారీ కాగా, రహదారి నిర్మాణం, విద్యుత్ స్తంభాలు, లైటింగ్ ఏర్పాట్లకు అవసరమైన నిధులు కేటాయించినట్లు తెలిపారు. రహదారి విస్తరణకు సహకరించిన నిర్వాసితులకు కృతజ్ఞతలు తెలిపారు.

పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మూడో వంతెన నిర్మాణ పనులను కూడా వేగవంతం చేస్తున్నట్లు ఆది శ్రీనివాస్ చెప్పారు. అభివృద్ధి పనుల్లో బిల్లుల చెల్లింపులు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రాజన్న ఆలయ నిర్మాణాలు ఆగమ శాస్త్ర నియమాలకు అనుగుణంగా చేపడుతున్నామని, శృంగేరి పీఠాధిపతి సూచనలను పరిగణనలోకి తీసుకుంటున్నామని తెలిపారు. వేములవాడను ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, ఆత్మ కమిటీ చైర్మన్ ముసుకు ముకుందరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నిర్ణీత గడువుకు ఐదు నెలల ముందుగానే 11 కోట్ల రైతు ఐడీల సృష్టి, డిజిటల్ వ్యవసాయంలో కీలక మైలురాయి - కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 25:డిజిటల్ వ్యవసాయ రంగంలో కీలక మైలురాయిని సాధిస్తూ, 2027 మార్చి 31 నాటికి 11 కోట్ల రైతు ఐడీలను సృష్టించాలన్న లక్ష్యాన్ని భారత ప్రభుత్వం ఐదు నెలల ముందుగానే చేరుకుంది. కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ విజయాన్ని ప్రస్తావిస్తూ, సుసంపన్నమైన రైతులతో అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతను సాకారం చేసే దిశగా ఇదొక కీలక ముందడుగు అని పేర్కొన్నారు. కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ కింద ఈ మైలురాయిని సాధించారు. రైతులకు ప్రత్యేకమైన డిజిటల్ గుర్తింపును అందించడమే రైతు ఐడీ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. దీని ద్వారా ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు, పంటల బీమా, విపత్తుల సమయంలో అందించే సహాయాన్ని రైతులు పారదర్శకంగా, సమర్థంగా, సకాలంలో పొందగలుగుతారు. అంతేకాకుండా, పత్రాల సమర్పణ భారాన్ని, పదేపదే ధ్రువీకరణ చేసుకోవాల్సిన అవసరాన్ని ఈ విధానం తగ్గిస్తుంది.

11 కోట్ల రైతు ఐడీల సృష్టి అక్టోబర్ 23వ తేదీ రాత్రికే విజయవంతంగా పూర్తయిందని వ్యవసాయ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2027 మార్చి 31వ తేదీని గడువుగా నిర్ణయించారు. అయితే, కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వాలు, క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో కృషి చేసి, నిర్ణీత గడువుకు ఐదు నెలల ముందుగానే లక్ష్యాన్ని చేరుకున్నారు. ఈ ఘనత సాధించినందుకు దేశంలోని రైతులందరికీ శ్రీ చౌహాన్ అభినందనలు తెలిపారు. రైతు ఐడీ అనేది రైతులకు సొంతమైన డిజిటల్ గుర్తింపు అని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ వ్యవసాయాన్ని మరింత సమర్థంగా, పారదర్శకంగా, సుసంపన్నంగా తీర్చిదిద్దే దిశగా ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు.

రైతు ఐడీ విధానం వల్ల ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ పదేపదే తిరగాల్సిన అవసరం, వివిధ పథకాల కోసం ఒకే పత్రాలను మళ్లీ మళ్లీ సమర్పించాల్సిన భారం గణనీయంగా తగ్గుతుందని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. గతంలో వివిధ ప్రభుత్వ ప్రయోజనాలను పొందేందుకు రైతులు పదేపదే పత్రాలు సమర్పించాల్సి వచ్చేది. దీనివల్ల వారి సమయం, డబ్బు రెండూ వృథా అయ్యేవి. రైతు ఐడీలతో పలు కీలక సేవలను మరింత సులభంగా, పారదర్శకంగా పొందే అవకాశం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు.

బ్యాంకు రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డు: రుణాలు పొందే ప్రక్రియ మరింత సులభతరం అవుతుంది. పత్రాలను పదేపదే ధ్రువీకరించాల్సిన అవసరం తగ్గుతుంది.

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన: ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు లేదా పంటలు నష్టపోయినప్పుడు పరిహారం అంచనా, పంపిణీ మరింత పారదర్శకంగా జరుగుతాయి. పరిహారం మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు.

విపత్తుల సమయంలో సహాయం: అత్యవసర పరిస్థితుల్లో అర్హులైన, అసలైన రైతులకు సహాయక చర్యల ప్రయోజనాలు మరింత వేగంగా అందుతాయి.

కనీస మద్దతు ధరపై పంటల కొనుగోలు: డిజిటల్ విధానం ద్వారా కొనుగోలు ప్రక్రియలో మధ్యవర్తుల పాత్రను తొలగించేందుకు వీలవుతుంది. తద్వారా రైతులు తమ పంటలకు దక్కాల్సిన మూర్తి విలువను పొందేలా చూడవచ్చు.

వ్యవసాయ సేవల పంపిణీలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. తద్వారా అర్హులైన రైతులు తక్కువ విధానపరమైన అడ్డంకులతో ప్రభుత్వ సహాయాన్ని పొందేందుకు వీలవుతుంది.

2024 సెప్టెంబర్ 2న కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన అనంతరం డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌ను ప్రారంభించారు. ఈ మిషన్ కింద అభివృద్ధి చేస్తున్న డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఫలితాలను చూపుతోంది. రైతు ఐడీ ఆధారిత సేవల పంపిణీ విధానం ద్వారా దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 6 కోట్లమందికి పైగా రైతులు వివిధ పథకాల కింద నేరుగా ప్రయోజనాలు పొందారు. ధ్రువీకరించిన రైతుల డేటాబేస్‌ను వ్యవసాయ సేవలతో అనుసంధానించడం వల్ల మోసాలకు, పదేపదే ధ్రువీకరణ చేసుకోవాల్సిన అవసరానికి అడ్డుకట్ట పడుతోంది. ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం మెరుగుపడటంతో పాటు, విధానాల రూపకల్పన, పథకాల పర్యవేక్షణ మరింత పటిష్ఠమయ్యాయి. దీనివల్ల పథకాల అమలు, ప్రయోజనాల పంపిణీని సులభంగా పర్యవేక్షించేందుకు వీలవుతోంది.

సహకార సమాఖ్య స్ఫూర్తికి సరైన నిదర్శనం

ఈ విజయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమష్టి కృషే కారణమని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. ఇది సహకార సమాఖ్య స్ఫూర్తికి అద్భుతమైన నిదర్శనమని అభివర్ణించారు. నిర్ణీత గడువుకు ముందుగానే లక్ష్యాన్ని సాధించడంలో భాగస్వాములైన కేంద్ర ప్రభుత్వ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల యంత్రాంగాలు, జిల్లా స్థాయి బృందాలు, గ్రామాల్లో పనిచేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బందికి ఆయన అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. కౌలు రైతులు, వాస్తవంగా సాగు చేస్తున్న రైతులను డిజిటల్ వేదికపైకి తీసుకువచ్చేందుకు వర్తించే నిబంధనలకు అనుగుణంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయి. ప్రభుత్వ సంక్షేమ, సహాయ పథకాల ప్రయోజనాలు పొందేందుకు అర్హులైన ఏ రైతూ దూరం కాకూడదన్నదే ఈ చర్యల ప్రధాన లక్ష్యం.

భారత వ్యవసాయ రంగాన్ని మార్చే సాంకేతికత

'కనీస ప్రభుత్వం – గరిష్ఠ పాలన' సూత్రానికి అనుగుణంగా రైతుల రిజిస్ట్రీని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉంది. రైతు ఐడీ అనేది కేవలం డిజిటల్ గుర్తింపు పత్రం మాత్రమే కాదు. పారదర్శకత, జవాబుదారీతనం, రైతు సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చే పాలనా వ్యవస్థకు ఇది బలమైన పునాది. రైతులకు ధ్రువీకరించిన డిజిటల్ గుర్తింపును కల్పించడం ద్వారా వ్యవసాయ సేవల పంపిణీని మెరుగుపరచడం, ప్రభుత్వ సహాయాన్ని నిర్దేశిత లబ్ధిదారులకు సమర్థంగా చేరేలా చూడటం ఈ కార్యక్రమం లక్ష్యం. దేశవ్యాప్తంగా ఉన్న రైతులకు అభినందనలు తెలిపిన శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, తమకు అర్హత ఉన్న పథకాలు, ప్రయోజనాలను అనవసర ఇబ్బందులు లేకుండా పొందాలని, భారత వ్యవసాయ రంగాన్ని నూతన శిఖరాలకు తీసుకెళ్లడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సాంకేతిక పరిజ్ఞానం రైతుల ప్రయోజనాలకు తోడ్పడుతూ, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణ లక్ష్యానికి సహకరించే ఆధునిక వ్యవసాయ వ్యవస్థను రూపొందించే దిశగా ఈ విజయం ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన పేర్కొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

చల్లగరిగలో జీవన్‌ఆర్ సీసీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే గంద్ర



నల్గొండ, అక్టోబర్ 25:చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గంద్ర సత్యనారాయణరావు సూచించారు. ఆదివారం చిట్యాల మండలంలోని చల్లగరిగ గ్రామంలో దసరా పండుగ సందర్భంగా నిర్వహించిన జీవన్‌ఆర్ సీసీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు ప్రదానం చేసే కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంద్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ.. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, పట్టుదలతో పాటు జట్టుగా పనిచేసే స్ఫూర్తిని పెంపొందిస్తాయని తెలిపారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటాలని, గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దబ్బెట అనిల్, మాజీ జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముఖిరాల మధు, వంశీకృష్ణ, ఘనపురం మాజీ పీఏసీఎస్ చైర్మన్ కుమార్ యాదవ్, బాల్ బ్యాడ్మింటన్ జిల్లా అధ్యక్షుడు గూట్ల తిరుపతి, సర్పంచులు సిరిపెల్లి జంపయ్య, ఇంగిలి రాజేందర్, సీనియర్ నాయకులు చిలుకల రాయకోమురు, మూల శంకర్ గౌడ్, నల్ల రాజిరెడ్డి, దూదిపాల బుచ్చిరెడ్డి, గుండెపురెడ్డి రవీందర్ రెడ్డి, తడుక కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాభిమానులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

డిండి ప్రాజెక్టుకు నీటి కేటాయింపు హర్షణీయం

గుత్తా సుఖేందర్ రెడ్డి

నల్గొండ, అక్టోబర్ 25: డిండి ఎత్తిపోతల పథకానికి 0.6 టీఎంసీల నీటిని కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు.

ఆదివారం నల్గొండలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డిండి ప్రాజెక్టు దేవరకొండ, మునుగోడు ప్రాంతాల్లో ఫ్లోరైడ్ సమస్యను తగ్గించి, ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడంలో కీలకమన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా సాధించేలా ఎంపీ డీకే అరుణ కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నీటి విషయంలో ప్రాంతీయ విభేదాలకు తావివ్వకూడదన్నారు. కృష్ణా బేసిన్‌లో పెండింగ్‌లో ఉన్న ఎస్ఎల్‌బీసీ, ఉదయసముద్రం, డిండి తదితర ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయంగా ఎత్తిపోతల ద్వారా నీటిని అందించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. రెండు జిల్లాల రైతులకు న్యాయం జరిగేలా అందరూ సమష్టిగా కృషి చేయాలని గుత్తా పిలుపునిచ్చారు.

త్యాగాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకం

అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో పోలీసుల సైకిల్ ర్యాలీ



ఖమ్మం, అక్టోబర్ 25: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్ ఆదేశాల మేరకు కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసులు, టీజీఎస్పీ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొత్తగూడెం రైల్వే స్టేషన్ సమీపం నుంచి ప్రారంభమైన ర్యాలీ పాత డిపో, పోస్ట్ ఆఫీస్ సర్కిల్ మీదుగా కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం, వారి సేవలను ప్రజలకు తెలియజేయడం ర్యాలీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. దేశం, సమాజం, ప్రజల రక్షణ కోసం అమరవీరులు చేసిన త్యాగాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని, అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. పోలీసులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో టీజీఎస్పీ అసిస్టెంట్ కమాండెంట్లు రామకృష్ణారెడ్డి, రంజిత్‌కుమార్, సీఐలు వెంకటేశ్వర్లు, ఇంద్రసేనారెడ్డి, జితేందర్, ఆర్ఐలు సుధాకర్, కృష్ణారావు, జి.వి. రామారావుతో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బెర్లిన్‌లో జర్మన్ పారిశ్రామిక నాయకులు, పరిశోధన సంస్థలతో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ సమావేశం

న్యూఢిల్లీ, అక్టోబర్ 25:కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ జర్మనీలో తన రెండు రోజుల అధికారిక పర్యటనను 2026 అక్టోబర్ 23న ముగించారు. బెర్లిన్‌లో ఆయన జర్మనీ ప్రభుత్వ ఉన్నతాధికారులు, పారిశ్రామిక రంగ ప్రముఖులు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు, ప్రవాస భారతీయులతో వరుస సమావేశాలు నిర్వహించారు. భారత్?జర్మనీ మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, అధునాతన తయారీ రంగం, పరిశోధన, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై ఈ సమావేశాల్లో ప్రధానంగా చర్చించారు.

జర్మనీ ఫెడరల్ ఛాన్సలరీలో ఆర్థిక, ఆర్థిక విధాన సలహాదారుగా, జీ7/జీ20 షెర్పాగా వ్యవహరిస్తున్న లెవిన్ హోల్లేతో పీయూష్ గోయల్ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. భారత్?జర్మనీ మధ్య ఆర్థిక సహకారం, ఆర్థిక సంబంధాలు, పెట్టుబడుల బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఉన్న అవకాశాలపై ఇరువురూ చర్చించారు.

సీమెన్స్ హెల్తినీర్స్ ఏజీ సీఈఓ బెర్న్డ్ మోంటాగ్, బెర్టెల్స్‌మన్ సంస్థ ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యుడు, బెర్టెల్స్‌మన్ ఇన్వెస్ట్‌మెంట్స్ సీఈఓ కార్స్టెన్ కోస్ఫెల్డ్, వోక్స్‌వ్యాగన్ ఏజీ సీఎఫ్ఓ, స్కోడా ఆటో సీఈఓ హోల్గర్ పీటర్స్‌తో మంత్రి విడివిడిగా సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య వ్యాపార భాగస్వామ్యాలు, పెట్టుబడులు, పారిశ్రామిక సహకారాన్ని విస్తరించే అవకాశాలను ఈ సమావేశాల్లో పరిశీలించారు.

అధునాతన పారిశ్రామిక సాంకేతిక పరిజ్ఞానాలు, ఆవిష్కరణల రంగాల్లో సహకారంపై చర్చించేందుకు ప్రముఖ జర్మన్ పారిశ్రామిక పరిశోధనా సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలోనూ శ్రీ పీయూష్ గోయల్ పాల్గొన్నారు. ఆయనతో పాటు పర్యటించిన భారతీయ వ్యాపార ప్రతినిధి బృందం సభ్యులు జర్మన్ పారిశ్రామిక రంగ ప్రతినిధులు, వివిధ రంగాల సంఘాలతో నిర్వహించిన ప్రత్యేక రౌండ్‌టేబుల్ సమావేశాల్లో పాల్గొని, ఇరు దేశాల మధ్య వ్యాపార సహకారాన్ని విస్తరించే అవకాశాలను పరిశీలించారు.

బెర్లిన్‌లోని ప్రవాస భారతీయులతో శ్రీ పీయూష్ గోయల్ సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో కూడా మాట్లాడారు.

పరిశోధన, ఆవిష్కరణల రంగానికి సంబంధించి చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా జర్మనీలో ఉన్న భారతీయ శాస్త్ర, సాంకేతిక పరిశోధకులు, విద్యార్థులతో శ్రీ పీయూష్ గోయల్ సంభాషించారు. ఎంపిక చేసిన ఫ్రాన్‌హోఫర్ పరిశోధనా సంస్థల అధిపతులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సూక్ష్మ ఎలక్ట్రానిక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, లాజిస్టిక్స్, స్మార్ట్ తయారీ, పారిశ్రామిక ఆవిష్కరణలు, బ్యాటరీ సాంకేతిక పరిజ్ఞానాలు వంటి అంశాలు ఈ సమావేశంలో చర్చకు వచ్చాయి. భారత్?జర్మనీ మధ్య పరిశోధనా సహకారాన్ని బలోపేతం చేయడం, పరిశ్రమలు?విద్యాసంస్థల మధ్య భాగస్వామ్యాలను విస్తరించడం వంటి అవకాశాలపై చర్చించారు.

వాణిజ్యం, పెట్టుబడులు, అధునాతన తయారీ, శాస్త్ర, సాంకేతికత, పరిశోధన, పారిశ్రామిక సహకారం వంటి రంగాల్లో భారత్?జర్మనీ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు ఉన్న అవకాశాలను ఈ పర్యటనలోని కార్యక్రమాలు స్పష్టం చేశాయి.

అయోధ్య పద్మశాలీయ నిత్యాన్న సత్రం ధర్మకర్తగా బడుగు బాలరాజు

నల్గొండ, అక్టోబర్ 25: అయోధ్యలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించతలపెట్టిన శ్రీ భక్త మార్కండేయ పద్మశాలీయ నిత్యాన్న సత్రం ధర్మకర్తల మండలి (అడ్‌హాక్) సభ్యునిగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌కు చెందిన బడుగు బాలరాజు నియమితులయ్యారు. ఈ మేరకు సత్రం అధ్యక్షుడు భూరం శంకర్ ఆదివారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. గత కొన్ని దశాబ్దాలుగా హిందూ సనాతన, ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక వికాసానికి బాలరాజు అందిస్తున్న సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు సత్రం నిర్వాహకులు తెలిపారు. అఖిల భారత పద్మశాలీయ నిత్యాన్న సత్రముల మార్గదర్శకులు చిలువేరు కాశీనాథ్, అధ్యక్షుడు భూరం శంకర్, కార్యదర్శి గజం గురునాథం సమక్షంలో ఈ ఎంపిక జరిగింది.

అయోధ్యకు వచ్చే పద్మశాలీయులు, ఇతర భక్తుల వసతి, నిత్యాన్నదానం కోసం ఈ సత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందుకోసం అయోధ్యలో సుమారు మూడు ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇప్పటికే ఒక ఎకరం ఆరు బిస్వాస్ స్థలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ (సేల్ డీడ్) ప్రక్రియ పూర్తయినట్లు నియామక పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా బడుగు బాలరాజు మాట్లాడుతూ.. మర్యాద పురుషోత్తముడైన శ్రీరామచంద్రుడి జన్మభూమి అయోధ్యలో రూపుదిద్దుకుంటున్న పద్మశాలీయ నిత్యాన్న సత్రం ధర్మకర్తగా ఎంపిక కావడం తన పూర్వజన్మ సుకృతమని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని పద్మశాలీయులు, భక్తుల సహకారంతో సత్రం నిర్మాణానికి, దాని పురోగతికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

భారత నావికాదళ డీజిల్-ఎలక్ట్రిక్ జలాంతర్గాముల స్వదేశీ ఏఐపీ వ్యవస్థ అభివృద్ధిలో కీలక ఘట్టం: 'సెట్టింగ్ టు వర్క్ ఫేజ్-2' కార్యకలాపాలు ప్రారంభం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 25:భారత నావికాదళం జలాంతర్గామి రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా ఒక మహోన్నత ఘట్టం నమోదైంది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థకు(డీఆర్‌డీఓ) చెందిన 'నావల్ మెటీరియల్స్ రీసెర్చ్ లాబొరేటరీ' (ఎన్ఎంఆర్ఎల్).. సంపూర్ణ స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన 'ఎయిర్ ఇండిపెండెంట్ ప్రొపల్షన్' (ఏఐపీ) వ్యవస్థ ఎనర్జీ మోడ్యూల్ 'సెట్టింగ్ టు వర్క్ ఫేజ్ (ఎస్టీడబ్ల్యూ)-2' కార్యకలాపాలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ అత్యాధునిక ఏఐపీ వ్యవస్థ.. ఆక్సిజన్ కోసం డీజిల్-ఎలక్ట్రిక్ జలాంతర్గాములు ఉపరితలానికి రావాల్సిన అవసరాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. తద్వారా నీటి లోపల సుదీర్ఘకాలం పాటు ఆటంకం లేకుండా సంచరించే వాటి సామర్థ్యం విశేషంగా పెరుగుతుంది.

2026 అక్టోబర్ 24న గుజరాత్‌లోని హజీరాలో ఉన్న లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్అండ్‌టీ) 'ఏఎమ్ నాయక్ హోవీ ఇంజనీరింగ్ కాంప్లెక్స్'లో ఈ ప్రారంభోత్సవ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రక్షణ శాఖ కార్యదర్శి, రక్షణ పరిశోధన-అభివృద్ధి విభాగ కార్యదర్శి, డీఆర్‌డీఓ ఛైర్మన్ శ్రీ రాజేష్ కుమార్ సింగ్ వర్చువల్ విధానంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. భారత నావికాదళ చీఫ్ ఆఫ్ మెటీరియల్స్ వైస్ అడ్మిరల్ బి. శివకుమార్, డీఆర్‌డీఓ నావల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్. బాలమురళీకృష్ణన్ గుజరాత్‌లోని ఎల్అండ్‌టీ హజీరా ప్రాంగణంలో ప్రత్యక్షంగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా డీఆర్‌డీఓ ఛైర్మన్ మాట్లాడుతూ.. స్వదేశీ ఏఐపీ ప్రాజెక్టును షాప్ ఫ్లోర్‌పై ప్రత్యక్ష కార్యాచరణ రూపంలోకి తెచ్చిన డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలను, పారిశ్రామిక బృందాలను అభినందించారు.శాస్త్రపరంగా వారికి ఉన్న పట్టుదల, పారిశ్రామిక సహకారాన్ని ఆయన విశేషంగా కొనియాడారు. ఈ కార్యక్రమం ప్రారంభం నుంచి ప్రతి దశలోని ట్రయల్స్‌తో పాటు పరీక్షలు, ప్రామాణీకరణలలో డీఆర్‌డీఓకు భారత నావికాదళం అందించిన సంపూర్ణ సహకారాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. హైడ్రోజన్, ఫ్యూయల్ సెల్ వ్యవస్థలకు అవసరమైన కఠినమైన భద్రతా ప్రమాణాలను ఎక్కడా ఉపేక్షించకుండా నావికాదళం నిర్దేశించిన కాలపరిమితిలోగా ఏఐపీ వ్యవస్థను జలాంతర్గాముల్లో ప్రవేశపెట్టేందుకు ప్రాజెక్టు తదుపరి దశలను వేగవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

తదుపరి దశలో విద్యుత్ ఉత్పత్తి కోసం ఈ ఏఐపీ ఎనర్జీ మోడ్యూల్‌ను కార్యాచరణలోకి తెచ్చి భారత నావికాదళం నిర్దేశించిన కఠినమైన నిబంధనలు, ప్రోటోకాల్స్ ప్రకారం క్షుణ్ణంగా పరీక్షించనున్నారు. అనంతరం 2027 ప్రారంభంలో 'కల్వరి-క్లాస్' జలాంతర్గామిలో ఈ వ్యవస్థను అమర్చడానికి గాను దీనిని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్‌కు (ఎండీఎల్) అప్పగిస్తారు

పోలింగ్ విధులు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

కలెక్టర్ రాజకుమారి

ఎన్నికల నిబంధనలు పాటించాలి.. ఓటింగ్ గోప్యతకు భంగం కలగకూడదు

అమరావతి, అక్టోబర్ 25:ఎంపీటీసీ, జెడ్పీ టీసీ ఎన్నికల పోలింగ్ విధులను నిబంధనల ప్రకారం, నిష్పక్షపాతంగా నిర్వహించాలని నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు.

ఆదివారం నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోలింగ్, సహాయ పోలింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు.ఎన్నికల విధివిధానాలపై పూర్తి అవగాహన పెంచుకుని, పోలింగ్‌కు ముందు, పోలింగ్ సమయంలో, అనంతరం చేపట్టాల్సిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల సామగ్రి, ఓటరు జాబితాలు, అవసరమైన రికార్డులను ముందుగానే పరిశీలించుకోవాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని, ఓటింగ్ గోప్యతను కాపాడాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో అనధికార వ్యక్తుల జోక్యాన్ని అరికట్టి, ఓటర్లందరితో సమానంగా వ్యవహరించాలన్నారు. సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు.

విజయవంతంగా ముగిసిన వసుంధర దిండి పాదయాత్ర

ఉపపీఠానికి చేరుకున్న యాత్రికులకు ఘన స్వాగతం



కామారెడ్డి, అక్టోబర్ 25:(నేటినిజం ప్రతినిధి): : శ్రీ క్షేత్ర నానిచ్ ధామ్ దక్షిణపీఠ్ రత్నగిరి (మహారాష్ట్ర) పీఠాధిపతి శ్రీ జగద్గురు రామానందాచార్య నరేంద్రాచార్య జన్మదినాన్ని పురస్కరించుకుని వసుంధర దిండి పాదయాత్ర నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా వందలాది మంది భక్తులు, శిష్యులు గత నెల 27న జుక్కల్ మండల కేంద్రంలోని బంగారుపల్లి?దోస్‌పల్లి వద్ద ఉన్న తెలంగాణ ఉపపీఠం నుంచి పాదయాత్రను ప్రారంభించారు. ఈ యాత్రలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్ షిండే, అరుణతార పాల్గొన్నారు.

శ్రీరామానంద సంప్రదాయాన్ని అనుసరిస్తూ క్రమశిక్షణతో సాగిన ఈ పాదయాత్రలో పర్యావరణ పరిరక్షణ, దేశభక్తి, సేవాగుణం, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించారు. వందలాది గ్రామాల్లో వేలాది మందికి పర్యావరణ పరిరక్షణ, ఆధ్యాత్మికత, దైవభక్తిపై అవగాహన కల్పించారు. ఈ నెల 21న పాదయాత్ర మహారాష్ట్రలోని నానిచ్ ధామ్ శ్రీ క్షేత్రానికి చేరుకుంది. అక్కడ శ్రీ జగద్గురువు రామానందాచార్య నరేంద్రాచార్య ఆధ్వర్యంలో భక్తులకు ఘన స్వాగతం లభించింది. స్వామిజీ దర్శనం చేసుకున్న భక్తులందరికీ జగద్గురువర్యులు ఆశీర్వాదాలు అందజేశారు.

28 రోజుల పాటు కొనసాగిన పాదయాత్ర శనివారం జుక్కల్ ఉపపీఠానికి చేరుకుంది. ఈ సందర్భంగా జుక్కల్ ప్రజాప్రతినిధులు, ఉపపీఠం సేవా సమితి సభ్యులు, ఆయా గ్రామాల ప్రజలు తిరుగు పాదయాత్రికులకు ఘన స్వాగతం పలికారు. జుక్కల్ పురవీధుల గుండా శోభాయమానంగా సాగిన యాత్ర ఉపపీఠానికి చేరుకోవడంతో కార్యక్రమం ముగిసింది.

దేశవ్యాప్తంగా గ్రామాల్లో 'గ్రామ సేవా ఏవం పరంప్రగత్ ఖేల్ దివస్' నిర్వహణ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 25:యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్?జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) 'వికసిత్ భారత్ 100 వారాల సంకల్ప్ అభియాన్'లో భాగంగా నిర్వహిస్తున్న 'నషా ముక్త్ యువ' కార్యక్రమం ఆరో వారంలో 'గ్రామ సేవా ఏవం పరంప్రగత్ ఖేల్ దివస్' (గ్రామ సేవ, సంప్రదాయ క్రీడల దినోత్సవం) నిర్వహించింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రచారాన్ని విద్యాసంస్థలకే పరిమితం చేయకుండా గ్రామీణ ప్రాంతాల ప్రజల వద్దకు తీసుకెళ్లింది.

ఎన్ఎస్ఎస్ డైరెక్టరేట్, 15 ప్రాంతీయ డైరెక్టరేట్ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని 160కి పైగా విద్యాసంస్థలు, వాటి పరిధిలోని దత్తత గ్రామాల్లో నిర్వహించారు. యువత, గ్రామ పంచాయతీ సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు సహా 80,000 మందికి పైగా ఇందులో పాల్గొన్నారు. రెండో నెలకు నిర్దేశించిన 'ఆరోగ్యవంతమైన యువత-వ్యసనాలకు దూరంగా ఉండే యువత (శక్తి ఏవం సేవ)' అనే ఇతివృత్తం కింద ఈ కార్యక్రమాలు చేపట్టారు. మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో శారీరక దృఢత్వం, సమాజ భాగస్వామ్యం, సామాజిక బాధ్యతల ప్రాముఖ్యతను ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

సంప్రదాయ క్రీడల్లో భాగంగా ఎన్ఎస్ఎస్ విభాగాలు కబడ్డీ, ఖోఖో, తాడులాగుడు, కుస్తీ వంటి స్థానిక క్రీడా పోటీలను నిర్వహించాయి. ఈ పోటీల్లో 21,500 మందికి పైగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా గ్రామీణ యువతలో ఆరోగ్యకరమైన వినోదం, జట్టుగా పనిచేసే స్ఫూర్తి, సానుకూల కార్యకలాపాల పట్ల ఆసక్తిని ప్రోత్సహించారు.

గ్రామ సేవా కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, గ్రామ పంచాయతీలు కలిసి గ్రామీణ ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టాయి. వీటిలో గ్రామ వీధులను శుభ్రం చేయడం, బహిరంగ ధ్య పనులు నిర్వహించడం, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు ఉన్నాయి. ఈ కార్యక్రమాల్లో 19,800 మందికి పైగా పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధి కోసం సమష్టిగా కృషి చేయడం ద్వారా 'నాట్ మీ, బట్ యూ' (ముందు నువ్వు, ఆ తర్వాత నేను) అనే ఎన్ఎస్ఎస్ నినాదాన్ని వారు ఆచరణలో చూపించారు.

ఆరోగ్యకరమైన జీవన విధానం, 'నషా ముక్త్' ప్రచారంపై అవగాహన కార్యక్రమాలు, యువత ఆధ్వర్యంలో చర్చలు నిర్వహించారు. వీటి ద్వారా 18,600 మందికి పైగా ప్రజలకు అవగాహన కల్పించారు. క్రీడలు, సమాజ సేవా కార్యక్రమాల్లో 29,500 మందికి పైగా యువతలు పాల్గొనడం ఈ కార్యక్రమంలో లింగ సమానత్వం, మహిళల భాగస్వామ్యానికి ఇచ్చిన ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది.ఈ ప్రచారాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యువత చనషాముక్త్‌యువ అనే హ్యాష్‌ట్యాగ్‌తో 4,000కు పైగా సోషల్ మీడియా పోస్టులు రూపొందించారు. దీంతో గ్రామస్థాయిలో చేపట్టిన కార్యక్రమాల గురించి మరింత ఎక్కువ మందికి తెలిసేలా ప్రచారానికి విస్తృత ప్రాచుర్యం కల్పించారు.

సంప్రదాయ క్రీడలు, సమాజ సేవ, అవగాహన కార్యక్రమాలను సమన్వయం చేయడం ద్వారా ఈ ప్రచారంలో ఆరో వారం విద్యాసంస్థలకు, గ్రామీణ సమాజాలకు మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసింది. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం, యువతను సానుకూల కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం, వ్యసనరహిత వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడం కోసం సమష్టి భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది.

శ్రీశైలం నవంబర్ దర్శనాలు, ఆర్జిత సేవల టికెట్లు విడుదల

మనమిత్ర వాట్సాప్, వెబ్‌సైట్ ద్వారా టికెట్లు పొందే అవకాశం

కార్తికమాసంలో నవంబర్ 10 నుంచి డిసెంబర్ 9 వరకు కొన్ని సేవలు నిలిపివేత

అమరావతి, అక్టోబర్ 25: జ్యోతిర్లింగాల్లో ఒకటైన నంద్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలంలో నవంబర్ నెలకు సంబంధించి శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామివారి స్పర్శదర్శనం, శీఘ్రదర్శనం, అతిశీఘ్రదర్శనం, ఆర్జిత సేవల టికెట్లను ఆదివారం విడుదల చేసినట్లు ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు తెలిపారు. భక్తులు సులభంగా టికెట్లు పొందేందుకు 80 శాతం టికెట్లను రాష్ట్ర ప్రభుత్వ మనమిత్ర వాట్సాప్ ద్వారా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. మనమిత్ర వాట్సాప్ నంబరు 9552 300009 ద్వారా టికెట్లు పొందవచ్చని, మిగిలిన 20 శాతం టికెట్లను ఏపీఎస్‌టీఎస్ వెబ్‌సైట్ లిలిలి.బిఎఐ.జీజూ.ణనీల.తిని ద్వారా బుక్ చేసుకోవచ్చని వివరించారు. స్వామి వారి, అమ్మవారి స్పర్శదర్శనం, శీఘ్రదర్శనం, అతిశీఘ్రదర్శనం టికెట్లను మనమిత్ర వాట్సాప్ లేదా ఆన్‌లైన్ ద్వారా పొందాలని సూచించారు.

స్వామివారి ఆర్జిత గర్భాలయ అభిషేకం, ఆర్జిత సామూహిక అభిషేకం, కుంకుమార్చన, గణపతి హోమం, రుద్ర హోమం, మహామృత్యుంజయ హోమం, చండీ హోమం, కల్యాణోత్సవం, అన్నప్రాశన, అక్షరాభ్యాసం తదితర 14 రకాల ఆర్జిత సేవలకు సంబంధించిన టికెట్లను కూడా వాట్సాప్, వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని అధికారులు తెలిపారు. టికెట్లు పొందిన భక్తులు మనమిత్ర లేదా ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకున్న టికెట్ హార్డ్‌కాపీతో పాటు ఒరిజినల్ ఆధార్ కార్డు లేదా జిరాక్స్ కాపీని తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. టికెట్లను స్కాన్ చేసి, ఆధార్ గుర్తింపు వివరాలతో సరిపోల్చిన తర్వాతే సంబంధిత ఆర్జిత సేవలకు అనుమతిస్తామని స్పష్టం చేశారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం పలు చోట్ల మనమిత్ర వాట్సాప్ సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 4.30 గంటల నుంచి ఉచిత సర్వదర్శనం యథావిధిగా కొనసాగుతుందని వెల్లడించారు.

కార్తికమాసం సందర్భంగా నవంబర్ 10 నుంచి డిసెంబర్ 9 వరకు స్వామివారి గర్భాలయ అభిషేకానికి రూ.5,000, సామూహిక అభిషేకాలకు రూ.1,500 చొప్పున రుసుము నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. ఈ కాలంలో ఉదయాస్తమాన సేవ, ప్రాతఃకాల సేవ, ప్రదోషకాల సేవలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్జిత హోమాలు, కల్యాణోత్సవం తదితర సేవలు యథావిధిగా కొనసాగుతాయని వివరించారు. కార్తికమాసంలో రద్దీ ఎక్కువగా ఉండే రోజుల్లో అమ్మవారి అంతరాలయంలో నిర్వహించే రూ.1,000 కుంకుమార్చనను అమ్మవారి ఆశీర్వచన మండపంలో నిర్వహించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు.

తమిళనాడులో జుక్కల్ ఎమ్మెల్యే తోటకు ఘన స్వాగతం

'ఓట్ బచావో-దేశ్ బచావో' కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మీకాంతరావు

నిజామాబాద్, అక్టోబర్ 25: 'ఓట్ బచావో-దేశ్ బచావో' కార్యక్రమంలో భాగంగా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావును తమిళనాడులోని నాలుగు జిల్లాలకు పరిశీలకుడిగా నియమించారు. ఈ నేపథ్యంలో శనివారం తమిళనాడు చేరుకున్న ఎమ్మెల్యేకు మధురై విమానాశ్రయంలో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. తమిళనాడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్. కామరాజ్‌తో పాటు నాలుగు జిల్లాల డీసీసీ అధ్యక్షులు వి. రాజమోహన్, ఎం. కృష్ణమూర్తి, సెంచి కుమార్ గాంధీ, ఇరంగూర్ పాండి తదితర కాంగ్రెస్ నాయకులు ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు.

అనంతరం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు విరుదునగర్ జిల్లాలో నిర్వహించిన 'ఓట్ బచావో-దేశ్ బచావో' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటు ప్రాముఖ్యత, ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు విలువ, ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

అంబాభవాని మాతకు ప్రత్యేక పూజలు



మహబూబ్‌నగర్, అక్టోబర్ 25:నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలోని శ్రీ అంబాభవాని మాత దేవాలయంలో ఆదివారం ఎస్ఎస్కే సమాజ్ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

పురోహితులు హరి సర్వోత్తమాచారి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కుంకుమార్చన కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ వేడుకలకు మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ప్రతి ఏడాది దసరా నవరాత్రి ఉత్సవాలు ముగిసిన అనంతరం వచ్చే పౌర్ణమి రోజున భవాని మాతకు ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చన నిర్వహించడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా ఆలయంలో భక్తిపారవశ్యం నెలకొంది. అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు.

కార్యక్రమంలో మండల మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు యగ్నేశ్వర్ రెడ్డి, ఎస్ఎస్కే సమాజ్ అధ్యక్షుడు చౌదరి అశోక్ రావు, మహిళా అధ్యక్షురాలు రాధా చంద్రప్రకాష్, ఎస్ఎస్కే సమాజ్ సభ్యులు, మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పాశమైలారంలో డ్రగ్స్ ముఠా గుట్టురట్టు !

పరిశ్రమ ముసుగులో మాదకద్రవ్యాల తయారీకి రసాయనాల సరఫరా

ముంబై క్రైమ్ బ్రాంచ్ మెరుపు దాడులతో వెలుగులోకి అక్రమ దందా

పటాన్‌చెరు పోలీసుల సహకారంతో పరిశ్రమలో సోదాలు

రూ.27 లక్షల విలువైన రసాయనాలు, ప్రయోగశాల పరికరాలు స్వాధీనం

పరిశ్రమ నిర్వాహకుడు రమేష్ బాబు సాకే అరెస్టు

గుజరాత్, ఉత్తరప్రదేశ్, తెలంగాణకు విస్తరించిన నెట్‌వర్క్

పారిశ్రామిక ప్రాంతాల్లో అక్రమ కార్యకలాపాలపై నిఘా ఏదీ?

అంచనా వేయడంలో స్థానిక అధికారుల వైఫల్యమే కారణం

సంగారెడ్డి, అక్టోబర్ 25:(నేటినిజం ప్రతినిధి): పరిశ్రమల ముసుగులో సాగుతున్న అక్రమ మాదకద్రవ్యాల దందా సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలో వెలుగుచూడటం కలకలం రేపుతోంది. పారిశ్రామిక ఉత్పత్తుల తయారీ పేరుతో మాదకద్రవ్యాల తయారీకి అవసరమైన రసాయనాలను ఉత్పత్తి చేస్తున్నట్లు గుర్తించిన మహారాష్ట్రలోని మీరా భయందర్?వసాయ్ విరార్ పోలీస్ కమిషనరేట్ క్రైమ్ బ్రాంచ్ అధికారులు పాశమైలారంలోని ఓ పరిశ్రమపై మెరుపు దాడులు నిర్వహించారు. అక్టోబర్ 21న జరిగిన ఈ దాడులకు సంబంధించిన వివరాలు శనివారం వెలుగులోకి వచ్చాయి. స్థానిక పటాన్‌చెరు పోలీసుల సహకారంతో చేపట్టిన సోదాల్లో సుమారు రూ.27 లక్షల విలువైన రసాయన పదార్థాలు, ప్రయోగశాల పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. పరిశ్రమ నిర్వాహకుడిగా పేర్కొన్న రమేష్ బాబు సాకేను అరెస్టు చేశారు.

మహారాష్ట్రలో ప్రారంభమైన మాదకద్రవ్యాల కేసు దర్యాప్తు గుజరాత్, ఉత్తరప్రదేశ్ మీదుగా తెలంగాణకు చేరుకోవడం సంచలనంగా మారింది. మీరా భయందర్?వసాయ్ విరార్ క్రైమ్ బ్రాంచ్ యూనిట్-4 అధికారులు గతంలో అరెస్టు చేసిన నిందితులను విచారించగా, మాదకద్రవ్యాల తయారీకి ఉపయోగించే రసాయనాల సరఫరా వ్యవస్థకు సంబంధించిన కీలక సమాచారం లభించినట్లు తెలిసింది. ఈ సమాచారం ఆధారంగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు సమీపంలోని ఐడీఏ పాశమైలారంలో కొనసాగుతున్న రసాయన తయారీ కేంద్రంపై పోలీసులు దృష్టి సారించారు. అక్టోబర్ 21న ప్రత్యేక బృందాలు పరిశ్రమలో సోదాలు నిర్వహించి, మెఫెడ్రోన్ అనే సింథటిక్ మాదకద్రవ్యం తయారీకి ఉపయోగించే రసాయనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నాయి. పరిశ్రమ నిర్వాహకుడు రమేష్ బాబు సాకే మేడ్చల్?మల్కాజిగిరి జిల్లాకు చెందిన వ్యక్తిగా సమాచారం.

పాశమైలారంలోని పరిశ్రమలో నిర్వహించిన సోదాల్లో సుమారు రూ.27 లక్షల విలువైన రసాయన పదార్థాలు, ఇతర ముడి రసాయనాలు, ప్రయోగశాల సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం పరిమాణం సుమారు 44.699 కిలోలుగా ఉన్నట్లు సమాచారం. ఈ రసాయనాలు మాదకద్రవ్యాల తయారీకి వినియోగిస్తున్నారా, వాటిని ఎక్కడి నుంచి సేకరించారు, ఎవరికి సరఫరా చేస్తున్నారు అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.ఈ కేసు దర్యాప్తులో గుజరాత్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య విస్తరించిన రసాయనాల సరఫరా నెట్‌వర్క్ వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. మొత్తం కేసులో ఇప్పటివరకు 25 మంది అరెస్టయినట్లు కొన్ని నివేదికలు వెల్లడించాయి. అయితే ఈ సంఖ్యకు సంబంధించిన అధికారిక నిర్ధారణ అవసరం. పాశమైలారం పరిశ్రమలో లభించిన రసాయనాల వెనుక ఎవరెవరి ప్రమేయం ఉంది? వాటిని ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారా? ఈ అక్రమ కార్యకలాపాలు ఎంతకాలంగా కొనసాగుతున్నాయి? అనే ప్రశ్నలకు దర్యాప్తులో సమాధానాలు లభించాల్సి ఉంది.

సొంతింటి కల నెరవేర్చడమే ప్రజాపాలన లక్ష్యం

మహబూబ్‌నగర్, అక్టోబర్ 25: పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజాపాలన లక్ష్యమని మల్లేపల్లి సర్పంచ్ కతలప్ప అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఆదివారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని మల్లేపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని తెలుసుకుని, లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం పేద కుటుంబాలకు సొంతింటి కల సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఇల్లు మంజూరైన లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన పేదలకు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయితే నిరుపేద కుటుంబాలకు శాశ్వత నివాసం లభిస్తుందని అన్నారు. ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు ఏవైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజు, నాయకులు లక్ష్మణ్, రాజు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై ఇంటింటా ప్రచారం

మహబూబ్‌నగర్, అక్టోబర్ 25: వరంగల్ -ఖమ్మం -నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టారు.

ఆదివారం మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల యూత్ అధ్యక్షుడు బండి రమేష్ ఆధ్వర్యంలో ఇంటింటా పర్యటించి అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పట్టభద్రులను కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండ బిక్షం రెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షుడు కొండబత్తిని జగదీశ్వర్,మాజీ ఎంపిటిసి సభ్యుడు మిర్యాల వెంకన్న, మాజీ ఉప సర్పంచ్ కర్ల నాగన్న, సీనియర్ నాయకులు మంద వెంకన్న,సంకపల్లి నరసింహారెడ్డి,వార్డు సభ్యులు ఎల్లాపుల ఉపేందర్,మాజీ వార్డు సభ్యులు ఎండి మదర్, నకరకంటి శివప్రసాద్,కల్లెడ మధు తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుడి పరిశ్రమ, పరాక్రమం, నిబద్ధత, అంకితభావం, సేవాభావాలను వేడుకగా జరుపుకునేందుకు 'మన్ కీ బాత్' నాకు ఒక పవిత్రమైన సందర్భం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 25:ప్రియమైన దేశవాసులారా! 'మన్ కీ బాత్' కార్యక్రమం మీకు మరోసారి స్వాగతం పలుకుతోంది. పన్నెండేళ్ల కిందట పవిత్ర విజయదశమి పర్వదిన సందర్భంగా 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ప్రారంభించాం. అప్పటి నుండి ఈ ప్రయాణం నిరంతరాయంగా కొనసాగ ుతోంది. ఈ ప్రయాణంలో మా సహ ప్రయాణికులు, మార్గదర్శకులు మీరే. మిత్రులారా! సామాన్యుడి పరిశ్రమ, పరాక్రమం, నిబద్ధత, అంకితభావం, సేవాభావాలను వేడుకగా జరుపుకునేందుకు 'మన్ కీ బాత్' నాకు ఒక పవిత్రమైన సందర్భం. మన దేశంలో శతాబ్దాలుగా తీర్థయాత్రల సంప్రదాయం ఉంది. దేశ ప్రజల కృషిని దగ్గరగా అర్థం చేసుకోవడానికి, వారి సేవలకు నివాళులర్పించడానికి 'మన్ కీ బాత్' నాకు ఒక తీర్థయాత్ర కంటే తక్కువేమీ కాదు. మిత్రులారా! సమాజం కోసం, దేశం కోసం జీవించే వారు స్వయంగా ఒక తీర్థయాత్ర స్వరూపం. గడచిన 12 సంవత్సరాలలో దేశంలోని నలుమూలల నుండి ఎందరో వ్యక్తులు వెలుగులోకి వచ్చారు. వారి అసాధారణమైన కృషి సాధారణంగా సమాజం దృష్టికి రాదు. 'మన్ కీ బాత్' అటువంటి లెక్కలేనన్ని స్ఫూర్తిదాయకమైన గాథలను మీ దృష్టికి తీసుకువచ్చింది.

ఈ కార్యక్రమం ద్వారా నేను ఒక విధంగా దేశ ప్రజల శక్తిని ఆరాధిస్తున్నాను. దీని ద్వారా దేశంలోని ప్రతి కుటుంబంతో మమేకమయ్యే అవకాశం నాకు లభిస్తుంది. 'మన్ కీ బాత్' వింటే నేను వారి కుటుంబంలోని వారి మధ్య కూర్చుని, ఒక కుటుంబ సభ్యుడిలా వారితో సంభాషిస్తున్నట్లు అనిపిస్తుందని ప్రజలు చెప్పే వందలాది సందేశాలు నాకు వస్తాయి. శ్రోతలైన మీ అందరి ఈ ఆత్మీయత, ఆప్యాయత నాకు ఎంతో అమూల్యమైన ఆస్తి.

నా ప్రియమైన దేశప్రజలారా! మన దేశంలో తరతరాలుగా మన గుర్తింపులో భాగంగా ఉన్న అనేక సాంప్రదాయిక నైపుణ్యాలు ఉన్నాయి. ఇప్పుడు ఈ సంప్రదాయాలను స్వీకరిస్తూనే వివిధ కొత్త ప్రయోగాలు జరుగుతున్నాయి. సాంప్రదాయిక నైపుణ్యాలను నేటి కాలానికి అనుగుణంగా ముందుకు తీసుకువెళ్తుండటం హర్షదాయకం. ఇలాంటి ప్రయత్నమే పంజాబ్‌లో కొంతకాలంగా జరుగుతోంది. 'ఖేతీ విరాసత్ మిషన్' అనే ఒక సంస్థ సేంద్రియ వ్యవసాయం, సాంప్రదాయిక వ్యవసాయ పద్ధతులను పునరుజ్జీవింపజేయడం ప్రారంభించింది. పంజాబ్‌లోని మాల్వా ప్రాంతంలో సహజ పత్తి సాగును ప్రోత్సహించాలని ఈ బృందం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమానికి 'నవ త్రింజన్' అని పేరు పెట్టారు. ఈ కార్యక్రమం కింద రసాయనాలను ఉపయోగించకుండా సేంద్రియ పత్తిని పండిస్తారు. ఇక్కడ సహజ రంగులతో కూడిన పత్తిని కూడా పండిస్తారు. దీనివల్ల దాని నుండి తయారయ్యే నూలు, వస్త్రాలకు రంగు వేయడానికి అదనపు రసాయనాల అవసరం ఉండదు. ఇది పర్యావరణంపై ఎంత గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందో మీరు ఊహించవచ్చు!

కొన్ని సంవత్సరాల కిందట 'నవ త్రింజన్' ఒక నేత పాఠశాలను కూడా ప్రారంభించింది. నేత నైపుణ్యాలను తర్వాతి తరానికి అందించడమే దీని లక్ష్యం. ఈ పాఠశాల ఎంతో మంది మహిళల జీవితాలను మార్చివేసింది. రమన్‌దీప్ కౌర్ ఇందుకు ఒక ప్రధాన ఉదాహరణ. ఆమె గతంలో కూలీగా పనిచేసేవారు. కానీ ఈ పాఠశాలలో శిక్షణ పొందిన తర్వాత ఇప్పుడు నైపుణ్యం ఉన్న నేత కార్మికురాలిగా గుర్తింపు పొందారు. రేఖా రాణి గారు శిక్షణ పొందే ముందు చేనేత వస్త్రాన్ని కనీసం చూడలేదు. ఆమె నేసిన శాలువాను గౌరవనీయ భారత రాష్ట్రపతి గారికి బహూకరించారు. అదేవిధంగా సునేహా దేవి గారు ఒకప్పుడు ఇళ్లలో పనిచేసేవారు. కానీ ఈనాడు ఆమె చేనేత మగ్గంపై అద్భుతమైన వస్త్రాలను తయారు చేస్తున్నారు. రజనీ కౌర్ గారు ఒకప్పుడు వ్యవసాయ కూలీగా పనిచేసేవారు. కానీ ఇప్పుడు ఆమె కొత్త నైపుణ్యాలు ఆమె కుటుంబాన్ని నడపడానికి ఎంతగానో సహాయపడుతున్నాయి. ఈ పాఠశాల నుండి శిక్షణ పొందిన తర్వాత ఇలాంటి ఎంతోమంది మహిళలు ఇప్పుడు దేశీయ సేంద్రియ పత్తి దారాలను ఉపయోగించి శాలువాలు, తువ్వాళ్లు, ఇతర వస్త్రాలను తయారు చేస్తున్నారు. ఈ ప్రయత్నాలు వారి జీవితాలకు సౌభాగ్యాన్ని తీసుకువస్తున్నాయి.

కొన్ని నెలల కిందట జాతీయ చేనేత దినోత్సవం నాడు నాకు ఈ బృందాన్ని కలిసే అవకాశం లభించింది. పని పట్ల వారికి ఉన్న అభిరుచిని, అంకితభావాన్ని నేను ప్రత్యక్షంగా చూశాను. వారి ఉజ్వల భవిష్యత్తు కోసం ఈ బృందం మొత్తానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

ప్రకృతి పట్ల గౌరవం చూపడం మనకు చాలా కాలంగా ఉన్న సంప్రదాయం. మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, నీటి వనరులను సంరక్షించుకోవడం మన బాధ్యత అని మన పూర్వికులు మనకు బోధించారు. దేశవ్యాప్తంగా ఎంతోమంది ప్రజలు ఈ స్ఫూర్తిని తమ జీవితాల్లో అలవర్చుకోవడం చూసి నేను చాలా సంతోషిస్తున్నాను. ఇదే స్ఫూర్తి ఉత్తరాఖండ్‌లోని తెహ్రీ గర్వాల్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. ఇక్కడ ఒక నదికి కొత్త జీవం తేవడానికి ప్రజలు ఏకమయ్యారు. ఈ నది పేరు హేవల్. కొంతకాలం కిందట హేవల్ నదిలో నీటిమట్టం తగ్గడం ప్రారంభమైంది. సమీపంలోని సహజ నీటి వనరులు కూడా ఎండిపోతున్నాయి. దాంతో స్థానిక పరిపాలనా యంత్రాంగంతో పాటు గ్రామస్థులు హేవల్ నదిని కాపాడటానికి ఒక ఉద్యమాన్ని ప్రారంభించారు.

ఈ సమయంలో వర్షపు నీటిని సంరక్షించడానికి చర్యలు తీసుకున్నారు. నీటిని భూగర్భంలోకి తీసుకువచ్చే పనులు చేశారు. పెద్ద సంఖ్యలో మొక్కలను నాటారు. ఈ రోజు ఈ ప్రయత్నం హేవల్ నదికి కొత్త జీవం పోయడమే కాకుండా డజన్ల కొద్దీ సహజ నీటి వనరులను పునరుద్ధరించడంలో కూడా సహాయపడింది.

సమాజం ఇటువంటి స్ఫూర్తితో ఏకమైన ప్పుడు మార్పు తప్పనిసరిగా వస్తుంది. మన పండుగలలో కూడా దీన్ని మనం చూస్తాం. పవిత్రమైన దీపావళి, ఛత్ పండుగలు మరికొన్ని రోజుల్లోనే జరుపుకోబోతున్నాం. ఈ లక్ష్యంతో ప్రతిచోటా పరిశుభ్రతా కార్యక్రమాలు మొదలవుతున్నాయి. మనం నివసించే ప్రతిచోటా పరిశుభ్రతను పాటించడం చాలా ముఖ్యం. మన చిన్న ప్రయత్నాలు కూడా మన పరిసరాలలో గణనీయమైన మార్పును తీసుకువస్తాయి.

ఈ పండుగ కాలంలో మీ చుట్టూ ఒక మార్పును మీరు గమనించి ఉంటారు. ఇప్పుడు ప్రజలు కొనుగోళ్లు చేసేటప్పుడు స్వదేశీ ఉత్పత్తులకు చాలా ప్రాముఖ్యత ఇవ్వడం ప్రారంభించారు. ఈ 'వోకల్ ఫర్ లోకల్ ' అనే స్ఫూర్తి ఇప్పుడు మన ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్లకు తీసుకువెళుతోంది. బీహార్‌లోని పూర్ణియా నుండి వచ్చే మఖానా ఇప్పుడు గ్రీన్‌కు చేరుతోంది. కర్ణాటకలోని కల్ బుర్గి నుండి వచ్చే కందిపప్పు ఇప్పుడు మాల్దీవులకు వెళుతోంది. అంటే ప్రపంచంలో భారతీయ రైతులకు కొత్త మార్కెట్లు తెరుచుకుంటున్నాయి. మిత్రులారా! స్థానిక ఉత్పత్తుల గురించి చర్చిస్తున్నప్పుడు నేను మీ దృష్టిని మరో అంశం వైపు మళ్లించాలనుకుంటున్నాను. ఉత్పత్తుల నాణ్యతతో పాటు వాటి ప్యాకేజింగ్ కూడా చాలా ముఖ్యమైంది. చాలాసార్లు మనం మార్కెట్‌లో ఏదైనా చూసినప్పుడు దాని మంచి ప్యాకేజింగ్ చూసిన తర్వాతే దాన్ని చేతుల్లోకి తీసుకుంటాం. ప్యాకేజింగ్ చూసిన తర్వాతే ఆ ఉత్పత్తి గురించి మనం తెలుసుకోవాలనుకుంటాం. దీన్ని అర్థం చేసుకుని ఇప్పుడు ప్యాకేజింగుకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నారు.

మహారాష్ట్రలో గిరిజన వర్గాలు తాము తయారుచేసే ఉత్పత్తుల ప్యాకేజింగ్‌పై చాలా దృష్టి పెట్టాయి. అక్కడ 'శబరి నాచురల్స్' ద్వారా తేనె, మహువా, చిరోంజి, వెదురుతో తయారు చేసిన ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకువస్తున్నారు. వారి ప్యాకేజింగ్‌పై గిరిజన కళా ముద్ర కనిపిస్తుంది. ఈ ప్యాకేజింగ్‌కు జపాన్ వారి ప్రతిష్టాత్మకమైన 'గుడ్ డిజైన్ అవార్డు' లభించిందని తెలిసి మీరు సంతోషిస్తారు. మన యువత కూడా ఈ రంగంలో ప్రయోగాలు చేస్తున్నారు. కర్ణాటకకు చెందిన 'బ్యాంబూ' స్టార్టప్ సంస్థ వెదురు, వ్యవసాయ వ్యర్థాల నుండి ప్యాకేజింగ్ మెటీరియల్‌ను తయారు చేస్తోంది.

స్థానిక ఉత్పత్తుల విషయానికి వస్తే ఖాదీ స్వాభావిక చర్చనీయాంశం. ఈ సంవత్సరం గాంధీ జయంతి నాడు ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ అమ్మకాలు ఒక్క రోజులోనే 28 కోట్ల రూపాయలను దాటాయి. ఇది గత సంవత్సరం కంటే ఒకటిన్నర కోట్ల రూపాయలు ఎక్కువ. అంటే ఖాదీకి ఆదరణ నిరంతరం పెరుగుతోంది. తమ నైపుణ్యం, కష్టంతో ఖాదీ హస్తకళల వంటి అనేక వస్తువులను సృష్టించే వారికి కూడా దాని ప్రయోజనాలు చేరుతున్నాయని అర్థం. మిత్రులారా! పండుగల సమయంలో మనం మన కుటుంబం కోసం, ప్రియమైన వారి కోసం చాలా వస్తువులు కొనుగోలు చేస్తాం. ఈసారి షాపింగ్ చేసేటప్పుడు స్థానిక కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వండి. మీ కొనుగోలు వారి ఉత్సాహాన్ని పెంచుతుంది. మీరు చూపే ఆదరణ 'వోకల్ ఫర్ లోకల్' ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తుంది. ఈ ఉద్యమం వేగంగా పురోగమిస్తే ఆత్మనిర్భర భారత్ కల కూడా అంతే వేగంగా నెరవేరుతుంది. అందువల్ల స్థానిక కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులకు ప్రాధాన్యతనిచ్చి, వాటిని ప్రముఖంగా ప్రదర్శించాలని నేను వ్యక్తిగతంగా మిమ్మల్ని కోరుతున్నాను.

మన దేశ ప్రజలకు ఒక గొప్ప ప్రత్యేకత ఉంది. మనం నూతన సాంకేతికతను చాలా వేగంగా స్వీకరిస్తాం. అంతేకాకుండా సాంకేతికతను మన దైనందిన జీవితంలో సహజంగానే ఒక భాగంగా చేసుకుంటాం. 'ఇ-సంజీవని యోజన' దీనికి ఒక చక్కటి ఉదాహరణ. ప్రజల జీవితాలను సులభతరం చేయడానికి సాంకేతికతను ఎంత సమర్థవంతంగా ఉపయోగించవచ్చో ఇది చూపిస్తుంది. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు దాదాపు 50 కోట్ల టెలి-కన్సల్టేషన్లు జరగడం చూసి నేను చాలా సంతృప్తిగా ఉన్నాను. ఈ సంఖ్య చాలా పెద్దది. ఇది సాంకేతిక శక్తికి, మన వైద్యుల సేవా భావానికి, దేశ ప్రజల విశ్వాసానికి ఒక గొప్ప ఉదాహరణ.

ఈనాడు ఇ-సంజీవని సేవ తన విస్తృత నెట్‌వర్క్ ద్వారా దేశంలోని మారుమూల ప్రాంతాలకు కూడా చేరుకుంది. దీని ద్వారా లబ్ధి పొందిన ప్రజల గాథలు మిమ్మల్ని కదిలిస్తాయి. అండమాన్ నికోబార్‌లోని బారాటాంగ్ ద్వీపంలో జారవా తెగకు చెందిన ఓహో-తాహోనెకు తీవ్ర జ్వరం వచ్చింది. శ్వాస తీసుకోవడంలో కూడా ఇబ్బంది పడడంతో స్థానిక ఆరోగ్య కార్యకర్తలు ఇ-సంజీవని ద్వారా ఒక నిపుణుడైన వైద్యుడిని సంప్రదించారు. న్యుమోనియాగా నిర్ధారించారు. నిపుణుడైన వైద్యుడి పర్యవేక్షణలోకి వచ్చిన వెంటనే పరిస్థితి వేగంగా మెరుగుపడటం ప్రారంభమైంది.

లక్షద్వీప్‌లోని కల్పేనిలో సుమారు 60 ఏళ్ల కున్హి కోయా గారి ఆరోగ్యం ఒక రోజు అకస్మాత్తుగా క్షీణించింది. అప్పుడు సముద్రం అవతల కవరత్తిలో ఉన్న ఒక అనుభవజ్ఞుడైన వైద్యుడిని ఇ-సంజీవని ద్వారా సంప్రదించారు. ఆ అనుభవజ్ఞుడైన వైద్యుడు స్థానిక వైద్య బృందానికి మార్గనిర్దేశం చేసి, కున్హి కోయా గారికి ఉపశమనం కలిగించారు. లద్దాఖ్‌లోని జూన్స్ కర్‌లో కున్జాంగ్ డోల్మా గారు గర్భధారణ సమయంలో కొన్ని సమస్యలను ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితిలో ఇ-సంజీవని ఆమెకు సహాయంగా నిలిచింది. నిపుణులైన వైద్యులు వెంటనే ఆమెకు సహాయం చేశారు. నాగాలాండ్‌లోని పెరెన్‌లో 12 ఏళ్ల ముషెమ్‌కు చెవి ఇన్ఫెక్షన్, జ్వరం వచ్చాయి. ముషెమ్ కూడా ఇ-సంజీవని ద్వారా లబ్ధి పొందారు. నిపుణులైన వైద్యులు వెంటనే అనారోగ్యాన్ని నిర్ధారించి, సరైన మందులను సూచించారు.

ఒకప్పుడు సాధారణ ఆరోగ్య పరీక్షలకు కూడా చాలా సమయం పట్టేది. వైద్యుడిని కలవడం చాలా కష్టంగా ఉండేది. ఈనాడు దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు 1,90,000 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు ప్రజల జీవితాల్లోకి కొత్త సౌకర్యాలను తీసుకువచ్చాయి. ఈ ఆరోగ్య మందిరాలు ఒక విధంగా పంచాయతీలకు ఆరోగ్య కేంద్రాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. అత్యంత సంతోషకరమైన విషయం ఏమిటంటే ఆరోగ్యంగా ఉండేందుకు ఇప్పుడు గ్రామస్థులు కూడా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్నారు. ఇందులో ఇ-సంజీవని కీలక పాత్ర పోషిస్తోంది.

ఈ నెల మొదట్లో నేను చెన్నైని సందర్శించాను. దేశవ్యాప్తంగా ఉన్న అనేక మంది శాస్త్రవేత్తలు, పరిశోధకులు, యువ ప్రతిభావంతులను అక్కడ కలిశాను. మన యువతరం నేడు మానవాళి భవిష్యత్తును మార్చగల అంశాలపై పనిచేస్తోంది. అటువంటి రంగాలలో ఒకటి మెదడు పరిశోధన. దీనికి సంబంధించి నేను సుధా గోపాల కృష్ణన్ బ్రెయిన్ సెంటర్‌ను మద్రాసు ఐఐటి లో ప్రారంభించాను. ఈ కేంద్రం ప్రపంచానికి ఉదాహరణగా నిలిచే ఒక బ్రెయిన్ ఇమేజింగ్ టెక్నాలజీ ప్లాట్‌ఫామ్‌ను సృష్టించింది. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా మనిషి మెదడుకు సంబంధించి అధిక రిజల్యూషన్ ఉన్న డిజిటల్ 3ఆ చిత్రాలను రూపొందిస్తున్నారు. రాబోయే రోజుల్లో మనుషులకు సంబంధించి 100 మెదళ్లను 3ఆ మ్యాపింగ్ చేయడం ద్వారా వాటిని వివరంగా అధ్యయనం చేయడం వీరి లక్ష్యం. ప్రపంచంలోనే ఇటువంటి ప్రాజెక్టు ఇదే మొదటిది. ఈ పనిలో అత్యంత శక్తిమంతమైన సూపర్ కంప్యూటర్‌ను ఉపయోగిస్తున్నారు.

ఈ బ్రెయిన్ సెంటర్ నిర్మాణంలో ప్రభుత్వంతో పాటు దేశ పరిశ్రమల రంగం కూడా కీలక పాత్ర పోషించింది. ఈ పరిశోధనా కేంద్రం కోసం ఎందరో ఐఐటి పూర్వ విద్యార్థులు, విద్యావేత్తలు కూడా ఏకమయ్యారు. విజ్ఞాన శాస్త్రంలో ఇంత పురోగతి సాధించినప్పటికీ మానవ మెదడు ఒక పెద్ద శాస్త్రీయ రహస్యంగానే మిగిలిపోయింది కాబట్టి ఈ ప్రాజెక్టు చాలా ముఖ్యమైంది. నేటికీ అల్జీమర్స్, డిమెన్షియా వంటి వ్యాధులకు ఖచ్చితమైన నివారణ లేదు. అందువల్ల మనిషి మెదడు పనితీరును విజ్ఞాన శాస్త్రం లోతుగా అర్థం చేసుకుంటే భవిష్యత్తులో కొత్త అవకాశాల కల్పన జరుగుతుంది. ఈ 100 మనిషి మెదళ్ల డేటాను వివిధ రంగాలలో పరిశోధన కోసం ఓపెన్ సోర్స్‌గా అందుబాటులో ఉంచాలని కూడా నిర్ణయించారు.

ఇటువంటి ఉన్నత పరిశోధనల్లో అవయవ దానం కీలక పాత్ర పోషిస్తుంది. జీవిత చరమాంకంలో అవయవాలను దానం చేసే వ్యక్తులు ఎందరి ప్రాణాలనో కాపాడడమే కాకుండా పరిశోధనలను కూడా సాధ్యం చేస్తారు. మధ్యప్రదేశ్‌లోని నర్మదాపురానికి చెందిన శివానీ గారిది అలాంటి ఒక ఉదాహరణ. శివానీ గారు ఒక రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆ కుటుంబం ఎంతో కష్టకాలం ఎదుర్కొంది. కానీ ఆ క్లిష్ట సమయాల్లో కూడా వారు తీసుకున్న నిర్ణయం మనందరికీ స్ఫూర్తిదాయకం. శివానీ గారి అవయవాలను దానం చేయాలనేది వారి నిర్ణయం. శివానీ కుటుంబం తీసుకున్న ఈ నిర్ణయం సమాజానికి, దేశానికి ఒక గొప్ప సందేశాన్ని పంపింది. ఇటువంటి మానవతా దృక్పథం ఒక కుటుంబంలోకి సంతోషాన్ని తిరిగి తీసుకురావడమే కాకుండా పరిశోధన కార్యక్రమాలకు కూడా ఎంతగానో సహాయపడుతుంది.

చెన్నై పర్యటనలో నాకు కలిగిన మరికొన్ని అనుభవాలను మీతో పంచుకోవాలనుకుంటున్నాను. నా మొదటి అనుభవం మెట్రోలో యువతతో సంభాషణ. రెండవ కార్యక్రమం మద్రాసు ఐఐటి మద్రాసు సందర్శన. ఈ సమయంలో సమస్యలకు వినూత్న పరిష్కారాలపై మన యువత ఎలా పనిచేస్తుందో చూడడం నాకు ఎంతో ఆనందాన్నిచ్చింది. నేను చూసిన స్టార్టప్‌లలో ఒకటి బంగారం నాణ్యతను పరీక్షించే పని చేస్తోంది. ఇది బంగారం కొనుగోళ్లలో జరిగే మోసాలను నివారించడంలో సహాయపడుతుంది. మోసాల ద్వారా విత్‌డ్రా చేసుకున్న బ్యాంకు నిధులను త్వరగా తిరిగి రాబట్టడానికి వీలు కల్పించే మరో ప్లాట్‌ఫామ్‌పై కూడా ఒక యువ బృందం పనిచేస్తోంది. గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్‌లో కృత్రిమ మేధ ఎలా సహాయపడగలదనే దానిపై కూడా ఒక బృందం పనిచేస్తోంది. మిత్రులారా! ఐఐటిలో నా సంభాషణ పూర్తిగా డీప్-టెక్‌పైనే కేంద్రీకృతమై ఉంది. ఈ స్టార్టప్‌లు ఐఐటి మద్రాస్ ఇంక్యుబేషన్ ఎకోసిస్టమ్ నుండి సహకారం పొందుతున్నాయి. ఈ స్టార్టప్‌లలో ఒకటి సముద్రంపై ఎగరగల ఎలక్ట్రిక్ వాహనాన్ని అభివృద్ధి చేస్తోంది. మరో స్టార్టప్ డ్రోన్‌లు, ఎలక్ట్రిక్ వాహనాల కోసం వేగంగా ఛార్జ్ అయ్యే బ్యాటరీలను తయారు చేస్తోంది. ఒక బృందం రక్షణ సాంకేతికతలో కృత్రిమ మేధ వినియోగంపై పనిచేస్తోంది.

మన యువతకు సరైన వాతావరణం, సహకారం లభిస్తున్నందువల్లే ఇంతటి అసాధారణమైన పనులు చేయగలుగుతోంది. లేకపోతే మన దేశంలో ప్రతిభకు ఎప్పుడూ కొరత లేదు. నేటి నుండి కొద్ది రోజుల తర్వాత అక్టోబరు 31వ తేదీన అటువంటి గొప్ప భారతీయ శాస్త్రవేత్తలలో ఒకరైన సరీందర్ సింగ్ కపానీ గారి 100వ జయంతి. ప్రపంచం ఆయనను 'ఫైబర్ ఆప్టిక్స్ పితామహుడి'గా పిలుస్తుంది. ఆయన పంజాబ్‌లోని మోగా జిల్లాలో జన్మించారు. సన్నని ఫైబర్ల ద్వారా కాంతిని ప్రసారం చేసే సాంకేతికతలో ఆయన చేసిన ఉన్నతస్థాయి పరిశోధనలు సమాచార ప్రసార ప్రపంచానికి ఒక కొత్త దిశను ఇచ్చాయి. మనం ఈనాడు జీవిస్తున్న ఇంటర్నెట్, డిజిటల్ కమ్యూనికేషన్ యుగాన్ని ఫైబర్ ఆప్టిక్స్ లేకుండా ఊహించడం కష్టం. ఈ సందర్భంగా సరీందర్ సింగ్ కపానీ గారికి నివాళులు సమర్పిస్తున్నాను. మన యువత కపానీ వంటి శాస్త్రవేత్తల గురించి చదవాలని, తెలుసుకోవాలని, స్ఫూర్తి పొందాలని నేను కోరుకుంటున్నాను.

మరికొద్ది రోజుల్లో అక్టోబర్ 31వ తేదీ సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి జయంతి. దేశం ఆ రోజును 'ఐక్యతా దినోత్సవం'గా జరుపుకుంటుంది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా 'రన్ ఫర్ యూనిటీ'ని నిర్వహిస్తారు. మన ఐక్యతను బలోపేతం చేసుకోవడానికి, దేశం పట్ల మన నిబద్ధతను తెలియజేసేందుకు 'రన్ ఫర్ యూనిటీ' ఒక గొప్ప అవకాశం. ఈసారి కూడా 'రన్ ఫర్ యూనిటీ'లో మీరందరూ ఉత్సాహంగా పాల్గొనాలని నేను కోరుతున్నాను. మీ కుటుంబ సభ్యులను, స్నేహితులను, మీ చుట్టూ ఉన్న వారిని ఇందులో భాగస్వాములను చేయండి.

భారతదేశ పిలుపు మేరకు 2023 సంవత్సరాన్ని 'అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం'గా జరుపుకున్న విషయం మీ అందరికీ గుర్తుండే ఉంటుంది. దీనికి ప్రపంచవ్యాప్తంగా చాలా సానుకూల స్పందన లభించింది. ఈ చొరవ ద్వారా శ్రీఅన్న సూపర్ ఫుడ్ అంటే చిరుధాన్యాలు మన సంస్కృతితో ఎంత లోతుగా ముడిపడి ఉన్నాయో ప్రజలు గ్రహించారు. ఈశాన్య ప్రాంతానికి కూడా చిరుధాన్యాల సాగులో గొప్ప సంప్రదాయం ఉంది. కానీ కాలక్రమేణా ప్రజలు దానికి దూరమయ్యారు. ఇప్పుడు ఈ పరిస్థితి మారుతోంది.

మేఘాలయలోని పశ్చిమ జయంతియా హిల్స్ జిల్లాలో ఖండులి అనే గ్రామం ఉంది. అక్కడ తరతరాలుగా స్థానిక ఆహార సంస్కృతిలో చిరుధాన్యాలు ఒక ముఖ్యమైన భాగంగా ఉన్నాయి. అయితే కొంతకాలంగా వాటిని పండించే రైతుల సంఖ్య తగ్గుతోంది. ఫలితంగా ఈ గ్రామానికి చెందిన ఇద్దరు స్నేహితులు ఒక కొత్త ప్రయత్నం చేశారు. వారు చిరుధాన్యాలతో కొత్త ఉత్పత్తులను తయారు చేయడంపై దృష్టి పెట్టారు. చిరుధాన్యాలతో కుకీలు, కేకులు, మఫిన్లు, అలాగే శిశు ఆహారాన్ని తయారు చేశారు.

ప్రతిభా అవార్డు గ్రహీతలు ఐఏఎస్, ఐపీఎస్‌లు కావాలి

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

-జెడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు



వరంగల్, అక్టోబర్ 25: పద్మశాలి ప్రతిభా పురస్కార గ్రహీతలంతా శ్రీ శివభక్త మార్కండేయ స్వామి ఆశీస్సులతో భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కావాలని జెడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు ఆకాంక్షించారు. ఆదివారం వరంగల్ జిల్లా 34వ డివిజన్ శివనగర్‌లోని పద్మశాలి పరస్పర సహకార సంఘం కళ్యాణ మండపంలో పద్మశాలి ప్రతిభా పురస్కార గ్రహీతల సన్మాన సభ నిర్వహించారు. పద్మశాలి ఆర్గనైజేషన్ ఆఫ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుండు కామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ సమావేశానికి మాజీ రాజ్యసభ సభ్యుడు రాపోలు ఆనంద భాస్కర్, తెలుగు అకాడమి చైర్మన్, మాజీ ఎస్‌డీఎల్‌సీ రిజిస్ట్రార్ కూచన వెంకటనారాయణ, పద్మశాలి జాతీయ సంఘం ఉపాధ్యక్షుడు గుండు ప్రభాకర్, పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, బైరీ శ్యాంసుందర్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు.

విద్యార్థులు సోషల్ మీడియాను చదువులకు, విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి మాత్రమే ఉపయోగించాలని పద్మశాలి ప్రతిభా పురస్కార గ్రహీత, మహబూబాబాద్ మెడికో విద్యార్థి కొంతం వైష్ణవి సూచించారు. ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన ఆమెకు పోపా ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. తెలుగు అకాడమి చైర్మన్, మాజీ ప్రొఫెసర్, ఎస్‌డీఎల్‌సీ రిజిస్ట్రార్ కూచన వెంకటనారాయణ, పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్, పద్మశాలి జాతీయ సంఘం ఉపాధ్యక్షుడు గుండు ప్రభాకర్ చేతుల మీదుగా వైష్ణవి అవార్డును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులు, పోపా కార్యవర్గ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరువుపైనా బీఆర్ఎస్ రాజకీయాలా

కేసీఆర్ కుటుంబం దిగజారుడు ప్రచారం

మీడియా సమావేశంలో ఎమ్మెల్యే గంద్ర సత్యనారాయణరావు ఫైర్

వరంగల్, అక్టోబర్ 25: కరువు పరిస్థితులను కూడా రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలని కేసీఆర్ కుటుంబం ప్రయత్నించడం దుర్మార్గమని భూపాలపల్లి ఎమ్మెల్యే గంద్ర సత్యనారాయణరావు విమర్శించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో కరువు ముప్పు పొంచి ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తుంటే, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెచ్చిన కరువుగా ప్రచారం చేయడం సిగ్గుచేటని అన్నారు.

హైదరాబాద్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాళేశ్వరం ప్రాజెక్టు వద్దకు వెళ్లి బీఆర్ఎస్ నాయకులు రాజకీయ హడావుడి చేస్తున్నారని ఆరోపించారు.

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో లోపాలకు గత ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో భారీగా ప్రజాధనం వృథా అయిందని, ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాలకు ఆశించిన స్థాయిలో నీరందలేదని విమర్శించారు. ఎండిన పొలాల వద్దకు వెళ్లి వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం రైతుల సమస్యలను రాజకీయం చేయడమేనని మండిపడ్డారు.

కరువు నివారణకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతుంటే ప్రతిపక్షాలు దుష్ప్రచారానికి దిగడం బాధ్యతారాహిత్యమని అన్నారు. నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా కాళేశ్వరం బ్యారేజీల మరమ్మతులు చేపట్టి ప్రజాధనం వృథా కాకుండా చూస్తామని తెలిపారు.

తాగునీటి కొరత నివారణ, పశువులకు నీటి వసతి కల్పన, ఉపాధి హామీ పనుల ద్వారా కరువును ఎదుర్కొనేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

కరువును రాజకీయం చేయకుండా అన్ని పార్టీలు ప్రజలకు అండగా నిలవాలని, ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని ప్రజలు గమనించాలని గంద్ర సత్యనారాయణరావు కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్, పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, మహిళలు పాల్గొన్నారు.ల

ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకులు

శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య

తెలంగాణ వాతావరణం... మాదిరెడ్డి సులోచన రచనా నేపథ్యం

తెలుగునాట నవలల్ని విశేషంగా చదివింపచేసే ఆలవాటు చేసిన రచయితల్లో మాదిరెడ్డి సులోచన ఒకరు. ఆనాడు కాల్పనిక ప్రభావంతో రచనలు చేసిన వారిలో ఆమె ఒకరు. ఊహాజనిత చిత్రణ కంటే వాస్తవిక జీవిత చిత్రణకు ప్రయత్నించారు.

ప్రేమలు, పెళ్ళిళ్ళు కంటే కుటుంబ జీవితానికి ప్రాధాన్యం ఇచ్చింది. ఉత్తమ ఉపాధ్యాయిని, ఉత్తమ కథా రచయిత్రి అవార్డులు పొందారు.

తెలంగాణ రచయిత్రుల సాహిత్య ప్రస్థానంలో మాదిరెడ్డి సులోచన ఒక మైలురాయి. ఆచార్య పాకాల యశోదారెడ్డి తరువాత తెలంగాణ పలుకుబడి, తెలంగాణ స్థానీయతను రచనల్లో చూపించిన రచయిత్రి మాదిరెడ్డి.

మారుతున్న కాలంలో మారని విలువలను తెలియ జెప్పడంతో పాటు స్త్రీలను చైతన్య వంతులను చేసే ధ్యేయంతో నవలా యజ్ఞం సాగించిన రచయిత్రి మాదిరెడ్డి సులోచన. సమాజం విధించే కుహనా కట్టుబాట్లు, ఆచారాలను ఆత్మస్థైర్యంతో ఎదుర్కొని, జీవితాలను తీర్చిదిద్దుకున్న పాత్రలు మాదిరెడ్డి నవలల్లో కనిపిస్తాయి. అలాగే, మార్పులకు లోనవుతున్న ఆర్థిక విధానాలతో ప్రభావితమైన సామాజిక విలువలు, ఆ క్రమంలో విపరీత మైన సంఘర్షణలకు లోనైన స్త్రీల జీవితాలకు కూడా సులోచన నవలలు అద్దం పడతాయి.

సమాజంలో ఎన్ని మార్పులు వచ్చినా, ఎన్ని తరాలు మారినా, మారని మానవ నైజాలు, ప్రవృతులూ, ప్రేమ , ద్వేషం, స్వార్థం లాంటివి మాదిరెడ్డి సులోచన నవలలో స్పష్టంగా కనిపిస్తాయి.

అర్ధ శతాబ్ది క్రితం, తెలంగాణ వాతవరణం, మానవ సంబంధాలూ కలిపి చక్కనైన కుటుంబ కథా నవలలను వ్రాశారు. ఆమె నవలలలో ఎక్కువగా మధ్య తరగతి కుటుంబాలలలో ఎదురయ్యే సమస్యలు కనిపిస్తూ వుంటాయి.

మన చుట్టూ వుండే వాతావరణం ప్రతిబింబిస్తూ వుంటుంది. ఆ నవల చదువుతూ వుంటే ఇది ఎక్కడో మనమధ్యే జరిగిందే అన్నట్లు అనుభూతిని కలిగిస్తుంది.

మాదిరెడ్డి సులోచన (26.10.1935 - 16.2.1983) మహబూబ్ నగర్ జిల్లా శంషాబాద్ లో 1935 అక్టోబర్ 26న ఒక భూస్వామ్య కుటుంబంలో మామిడి రామకృష్ణారెడ్డి, మాణిక్యమ్మ దంపతులకు జన్మించారు.

ఆ రోజుల్లో దొరలు, దేశముఖ్ ల ఇళ్ళల్లోని ఆడపిల్లలు ఘోషా పాటించడం వల్ల సులోచన ప్రాథమిక విద్యను ఇంట్లోనే పూర్తి చేసుకున్నారు. కొంతకాలం ఆర్య సమాజ్ గురుకుల పాఠశాల, బేగం పేటలో చదువుకుని మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. రాజ బహదూర్ వెంకట్రామిరెడ్డి కళాశాల, నారాయణ

అక్టోబర్ 26... మాదిరెడ్డి సులోచన జయంతి



గూడలో బి.ఎస్సీ డిగ్రీ చదివారు. భువనగిరి, నల్గొండ జిల్లా వాస్తవ్యులైన మాదిరెడ్డి రామచంద్రారెడ్డితో 1952లో వివాహం జరిగింది. వివాహం తర్వాత భర్త ప్రోత్సాహంతో ఉన్నత విద్యను అభ్యసించారు. అలా ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బి.యిడి ఎం.ఎ., ఎం.యి.డి పూర్తి చేశారు.

తర్వాత మాదిరెడ్డి సులోచన ఉపాధ్యాయవృత్తిలో చేరి 1971 వరకు సుమారు పది సంవత్సరాలు కెమిస్ట్రీ ఉపాధ్యాయినిగా సెయింట్ జాన్స్ హైస్కూలులో పనిచేశారు. బోధనను తన వృత్తిగానే కాక ప్రవృత్తిగా కూడా మలచుకున్న ఉత్తమ పాటు ఇథియోపియా, జాంబియా దేశాలకు వెళ్ళి అక్కడ కూడా కొంతకాలం ఉపాధ్యాయినిగా పనిచేశారు.

1965 లో ' జీవనయాత్ర ' పేరుతో ప్రారంభమైన ఆమె నవలా ప్రస్థానం తరంగాలు , కలహంస, అంద గాడు, అపురూప , నాగ మల్లికలు, సంధ్య, శిక్ష, పూల మనసులు, మిష్టర్ సంపత్ ఎంఎ, లాహిరి, సజీవ స్మృతులు, స్నేహ ప్రియ, రాలిన రేకులు, నవతరం, ఎంత ఘాటు ప్రేమయో, పంతులమ్మ, వారసులు, కలకాదు సుమా, వంశాంకురం, అందని పిలుపు, నెలవంక, బిందు పథం, సుప్రియ, గడ్డితినే మనుషులు, మరో ప్రేమకథ, గాజు బొమ్మలు, ప్రేమ పంజరం, అపరంజి, సంసార నౌక, పుణ్య పురుషులు, ఋతుచక్రం, చిగురాకులలో చిలకమ్మ, మీరైతే ఏం చేస్తారు, ఆశయాల ఆఖరి మెట్టు, అధికారులు - ఆశ్రిత జనులు, సంధ్యారాగం, గెలుపు నాదే, అభినేత్రి, ఇల్లు కట్టి చూడుపెళ్ళి చేసి చూడు, శ్రీనిలయం, సృష్టిలో తియ్యనిది లాంటి 72 నవలలతో పాటూ దాదాపు 150 కథలు, 21 నాటికలు, 10 ఏకాంకికలు రాశారు. వీరి రచనలు ఆనాటి దిన, వార, మాస పత్రికల్లో ప్రచురిత మయ్యాయి. ఆమె రచించిన 10 నవలలు మేన కోడలు, ప్రేమలు - పెళ్ళిళ్ళు, ఈ కాలం పిల్లలు, ఈ తరం మనిషి , కళ్యాణి, కలవారి సంసారం, చందమామ, తరం మారింది మొదలైనవి సినిమాలుగా నిర్మించ బడ్డాయి.

1977 లో తరం మారింది సినిమాకు నందిఅవార్డు లభించింది. ఆమె రచనలపై అనేక పరిశోధనలు జరిగాయి. 1965 నుండి రచనలు ప్రారంభించిన మాదిరెడ్డి సులోచన 1983 ఫిబ్రవరి 16న అకాల మరణం చెందే వరకు రచనను కొనసాగించారు.

గృహలక్ష్మి నవలకు 1978లో స్వర్ణ కంకణము లభించింది. ఉత్తమ ఉపాధ్యాయిని, ఉత్తమ కథా రచయిత్రి అవార్డులు పొందారు.

దాదాపు రెండు దశాబ్దాలపాటు విభిన్న సామాజిక సమస్యలను ఇతివృత్తంగా చేసుకొని నవలలు వ్రాసి ఆంధ్ర పాఠకుల హృదయాలలో చిర స్మరణీయంగా నిలచి పోయిన మాదిరెడ్డి సులోచన 1984లో ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలిన దుర్ఘటనలో మరణించారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

అల్గునూర్ అభివృద్ధికి కృషి.. కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, అక్టోబర్ 25: కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ డివిజన్ అభివృద్ధికి తోడ్పాటునందిస్తామని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ హామీ ఇచ్చారు. డివిజన్‌లోని వారసంతలను మేయర్ కొలగాని శ్రీనివాస్, కార్పొరేటర్ కాల్వ మల్లేశం ఆదివారం ప్రారంభించారు. అలాగే పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అల్గునూర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తామని, స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించే విధంగా ప్రయత్నిస్తున్నామన్నారు. అలాగే ప్రస్తుతం నీటి కొరత వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు ప్రతీ ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తక్కువ చేయాలని కోరారు. విలీన గ్రామాల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

భారత బలగాలకు అండని లక్ష్యమంటూ ఏదీలేదు.. ఎయిర్‌చీఫ్ మార్షల్ ఏపీ సింగ్..!

న్యూఢిల్లీ, అక్టోబర్ 25:భారత బలగాలకు అండని లక్ష్యమంటూ ఏదీ లేదని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ అన్నారు. గత ఏడాది పాక్‌లోని ఉగ్రస్థావరాలపై 'ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత్ చేపట్టిన కచ్చితమైన దాడులు ఈ విషయాన్ని నిరూపించాయన్నారు. ఆ సమయంలో వాయుసేన వ్యూహాత్మకంగా ముందడుగు వేసి, ఉగ్రవాదులను కోలుకోలేని దెబ్బ కొట్టిందని చెప్పారు. ప్రస్తుతం సైన్యం వద్ద ఉన్న అణ్వాయుధాలు, కచ్చితత్వంతో ఛేదించగల అధునాతన క్షిపణి వ్యవస్థలు శత్రువుల గుండెల్లో వణుకు పుట్టిస్తున్నాయన్నారు.

ఆ ఆపరేషన్‌తో స్వదేశీ ఆయుధాల శక్తిని ప్రపంచ దేశాలు చూశాయని పునరుద్ఘాటించారు. స్వదేశీ ఉత్పత్తుల తయారీ.. రక్షణ రంగం ఆధునికీకరణకే కాకుండా దేశ వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తికి సైతం బాటలు వేస్తోందన్నారు. కాగా, అక్టోబర్ 31న పదవీ విరమణ చేయనున్న ఏపీ సింగ్.. పీటీఐతో ప్రత్యేకంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ దేశాల్లో అస్థిరత కొనసాగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో దేశ భద్రతను సుస్థిరం చేసేందుకు ఇండో పసిఫిక్ ప్రాంతంలో మన శక్తి సామర్థ్యాల ప్రదర్శన ఎంతో ముఖ్యమని ఆయన అభిప్రాయం వ్యక్తంచేశారు.జాతీయ ప్రయోజనాలను పరిరక్షించేందుకు, ఇండో-పసిఫిక్‌లో నెలకొన్న పరిస్థితిని వైమానికదళం నిశితంగా పర్యవేక్షిస్తోందని, దేశ భద్రతను కాపాడటానికి ఐఏఎఫ్ ఎప్పుడూ సిద్ధంగా ఉందని ఏపీ సింగ్ అన్నారు.



కన్నడ యువతకు ఉద్యోగాలివ్వకపోతే చర్యలు కఠినంగుంటాయ్ : డీకే శివకుమార్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 25: కర్ణాటక కేంద్రంగా పనిచేసే ప్రైవేటు సంస్థలు ముఖ్యంగా ఐటీ కంపెనీల యాజమాన్యాలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నియామక ప్రక్రియలో కన్నడిగులను ఉద్దేశపూర్వకంగా పక్కన పెడుతున్నట్లు తేలితే ఆయా సంస్థలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానికుల హక్కులు, గౌరవం, ఉద్యోగ అవకాశాలను నిర్లక్ష్యం చేయడాన్ని ప్రభుత్వం ఏమాత్రం సహించబోదని అన్నారు.

బెంగళూరులోని ఐటీ కంపెనీల్లో కన్నడిగులకు ఉద్యోగాలు నిరాకరిస్తున్నారని తమకు ఫిర్యాదులు వచ్చాయని, వీటిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని డీకే ఎక్స్‌లో పోస్టు చేశారు. కన్నడ ప్రజల హక్కులు, గౌరవానికి ఇబ్బంది కలిగించే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం అనుమతించబోదని చెప్పారు. కన్నడిగుల ప్రతిభ, నైపుణ్యాలు, సామర్థ్యాలను చూసి రాష్ట్రం గర్విస్తోందని అన్నారు. ఏదైనా ప్రైవేటు సంస్థ వారిని ఉద్దేశపూర్వకంగా పక్కనపెడితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు.

కన్నడిగులకు ఉద్యోగాల అంశంపై సోషల్ మీడియాలో ఇటీవల వీడియోలు వైరల్ అయ్యాయి. తాజాగా రెజ్యూమెలో భాష స్థానంలో కన్నడ అని ప్రస్తావించినందుకు తన దరఖాస్తును తిరస్కరించారని చెబుతూ ఓ మహిళ సామాజిక మాధ్యమాల్లో పోస్టుచేశారు. ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కూడా ట్యాగ్ చేశారు. ఇదే తరహా ఫిర్యాదులు ఇటీవల ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలోనే సీఎం తీవ్రస్థాయిలో స్పందించారు.

ఇంటి అద్దె చెల్లించలేక.. నకిలీ రూ.500 నోట్లు ముద్రించిన వ్యక్తి

ముంబై, అక్టోబర్ 25: అద్దె ఇంట్లో నివసిస్తున్న వ్యక్తి కిరాయి చెల్లించలేక ఇబ్బంది పడ్డాడు. ఈ నేపథ్యంలో ఆ ఇంట్లో రహస్యంగా నకిలీ రూ.500 నోట్లను అతడు ముద్రించాడు. ఇంటి యజమానితో గొడవ పడిన ఆ వ్యక్తి పారిపోయాడు. ఆ ఇంటి తాళం పగులగొట్టి లోపలకు వెళ్లి చూసిన యజయాని నకిలీ రూ.500 నోట్లు ప్రింట్ చేసి ఉండటం చూసి షాక్ అయ్యాడు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది. నాగ్‌పూర్‌లోని త్రిమూర్తి నగర్‌కు చెందిన పుష్పక్ కృష్ణ భండార్కర్ అలియాస్ బెండానె, ఏడాదిన్నర కిందట ఖర్బీ ప్రాంతంలో ఒక గదిని అద్దెకు తీసుకున్నాడు. అద్దె ఒప్పందం జనవరిలో ముగిసింది. అలాగే గత కొన్ని నెలలుగా ఇంటి యజమానికి అద్దె చెల్లించడం కూడా అతడు ఆపేశాడు.కాగా, ఇంటిని ఖాళీ చేయాలని యజమాని రమేష్ డిమాండ్ చేయగా పుష్పక్ కత్తితో బెదిరించాడు. దీంతో ఇంటి యజమాని పోలీసులను ఆశ్రయించంతో అతడిపై కేసు నమోదు చేశారు. ఆ తర్వాత చాలా కాలంగా పుష్పక్ అద్దె ఇంటికి రాలేదు. ఈ నేపథ్యంలో యజమాని రమేష్ అక్టోబర్ 24న సుత్తితో డోర్ తాళం పగులగొట్టాడు. ఇంటి లోపలకు వెళ్లి చూడగా బకెట్‌లో కరెన్సీ నోట్ల కట్టలు, అక్కడక్కడ పడిఉన్న కాగితపు షీట్‌లు, ఒక ప్రింటర్ ఉండటం చూసి ఆయన షాక్ అయ్యాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు.మరోవైపు పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఆ ఇంట్లో నకిలీ రూ.500 నోట్లు ప్రింటింగ్ చేస్తున్నట్లు గ్రహించారు. కౌంటింగ్ యంత్రాన్ని తెప్పించి లెక్కించారు. రూ.37 లక్షల విలువైన నకిలీ నోట్లను పుష్పక్ ముద్రించినట్లు గుర్తించారు. ఒకవైపు పాక్షికంగా ముద్రించిన కరెన్సీ నోట్లు, ప్రింటింగ్ సామగ్రి సహా రూ.48 లక్షల విలువైన వాటిని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న పుష్పక్ కోసం పోలీసులు వెతుకుతున్నారు. అతడు ముంబైలో ఉన్నట్లు తెలుసుకుని అరెస్ట్ కోసం ప్రయత్నిస్తున్నారు.

రానున్న ఐదు రోజులు అప్రమత్తంగా ఉండండి.. అధికారులకు ఏపీ హోంమంత్రి ఆదేశం..!

అమరావతి, అక్టోబర్ 25: ఏపీలో అర్నబ్ తుపాను బీభత్సం సృష్టించే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఏపీ హోంమంత్రి అనిత సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. రానున్న ఐదు రోజులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సోమవారం నుంచి విస్తారంగా, మంగళ, బుధవారాల్లో కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

బుధవారం బాపట్ల-విశాఖ తీరాల మధ్య తుపాను తీరం దాటే సూచనలు ఉన్నాయని, ఆ సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని మంత్రి చెప్పారు.

తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకరంగా ఉన్న హోర్డింగులను వెంటనే తొలగించాలని హోంమంత్రి ఆదేశించారు. అవసరమైతే తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. సహాయక



చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని, బీచ్‌లలోకి పర్యాటకులను అనుమతించవద్దని అన్నారు. భారీ అలలు ఎగిసిపడే ప్రాంతాల్లో సెల్ఫీలు తీసుకోవడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రైతులు, ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, వ్యాప్తి చేయవద్దని సూచించారు. విపత్తుల నిర్వహణ సంస్థ, ఆర్టీజీఎస్ జారీచేసే అధికారిక హెచ్చరికలను పాటించాలని మంత్రి అనిత కోరారు.

ఎన్నికల్లో ఓటరు నమోదే కీలకం : ఎర్రబెల్లి దయాకర్ రావు



వరంగల్, అక్టోబర్ 25: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కీలకమని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకరరావు అన్నారు. వరంగల్ జిల్లా గీసుగొండలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అధ్యక్షతన మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశానికి ఎర్రబెల్లి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ కార్యకర్తలు, నాయకులకు దిశా నిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృత కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు.

పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల్లోని అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని కోరారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల భాగస్వామ్యం పెరిగేలా ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, సాంబారి సమ్మారావు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల మార్చురీలో మృతదేహాలు కుళ్లిపోవడం దారుణం : మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి

మహబూబ్‌నగర్, అక్టోబర్ 25:మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో వంద పడకల హాస్పిటల్ మార్చురీలో మృతదేహాలు కుళ్లిపోవడం దారుణమని మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సేవలు అందించే గవర్నమెంట్ హాస్పిటల్‌కి కోతల్లేని విద్యుత్ ఇవ్వలేక పోతుందని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆప్తులు మరణించి తీవ్ర దుఃఖంలో ఉండే కుటుంబ సభ్యులకు మృతదేహాలను గౌరవంగా అప్పగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందన్నారు.

కానీ నిర్లక్ష్యంతో కుళ్లిన మృతదేహాలు ఇవ్వడం హేయమైన చర్యగా అభివర్ణించారు. గతంలో కూడా మృతదేహాలను కుక్కలు పీక్కుతినడం, విద్యుత్ సరఫరా నిలిచిపోవడం వంటి ఘటనలు చూశామని గుర్తు చేశారు. అయినప్పటికీ హాస్పిటల్‌లోసేవలు మెరుగు పడలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మెరుగైన వైద్య సేవలు ,వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు..

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.